నేటి దినపత్రిక
18వ వసంతంలోకి
సూర్య
www.suryaa.com
చిత్తూరు | తిరుపతి
శుక్రవారం | 11 అక్టోబర్ 2024 | పేజీలు 10

## సూర్యప్రభ వాహనంపై బద్రి నారాయణుడి అలంకరణలో మలయప్ప స్వామి

**తిరుమల, మేజర్‌న్యూస్:** తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో 7వ రోజు గురువారం ఉదయం 8గంటలకు స్వామి వారు బద్రి నారాయణుడి అలంకారంలో సూర్యప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. వాహనం ముందు భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ వాహనసేవ కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు.

**సూర్యప్రభ వాహనం-ఆయురారోగ్యప్రాప్తి...** సూర్యుడు సకలరోగ నివారకుడు, ఆరోగ్యకారకుడు, ప్రకృతికి చైతన్యప్రదాత. ఔషధీపతి అయిన చంద్రుడు కూడా సూర్యతేజం వల్లనే ప్రకాశిస్తూ వృద్ధి పొందుతున్నారు. ఈ



ఉత్సవంలో శ్రీవారి చుట్టూ ఉన్న సూర్యప్రభ సకల జీవుల చైతన్యప్రభ, సూర్యమండల మధ్యవర్తి శ్రీమన్నారాయణుడే. అందుకే సూర్యున్ని సూర్యనారాయణుడు అని కొలుస్తున్నాం. సూర్యప్రభ వాహనంలో స్వామివారిని దర్శిస్తే ఇతోధిక భోగభాగ్యాలు, సత్సంతాన సంపదలు, ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయి.వాహన సేవలో తిరుమల పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీడీ ఈఓ శ్యామల రావు దంపతులు, అదనపు ఈఓ వెంకయ్య చౌదరి, జెఈఓలు గౌతమి, వీరబ్రహ్మం, సివిఎస్వో శ్రీధర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## భూ సర్వే పనులు పూర్తి చేయాలి

### కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్



**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:**

శెట్టిపల్లి భూముల సమస్యల పరిష్కార కోసం వెంటనే భూ సర్వే పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. గురువారం ఉదయం జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ నారపు రెడ్డి మౌర్య, రెవెన్యూ,తుడా అధికారులు, నగర పాలక సంస్థ, ఇంజనీరింగ్, ప్లానింగ్, అధికారులు, శెట్టిపల్లి సాధనసమితి ప్రతినిధులతో కలసి శెట్టిపల్లి పరిధిలోని ప్రభుత్వ భూములను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ శెట్టిపల్లి భూములు సమస్యల పరిష్కార కోసం రెవెన్యూ,ల్యాండ్ సర్వే, మునిసిపల్ కార్పొరేషన్ అధికారుల సమన్వయ చేసుకొని భూములను సర్వే పూర్తి చేయాలన్నారు. అలాగే శెట్టిపల్లి సాధన కమిటీ సభ్యులు, ప్రజల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని వారికి కలెక్టర్ చూచించారు. ఈ ప్రాంతంలో ఎప్పటి నుండి ఇక్కడ ఎంత మంది ప్రజలు నివాసాలు ఉన్న వారిని గుర్తించాలని వీఆర్ఓను ఆదేశించారు. ప్రస్తుతం ఇక్కడ నివాసాలు ఉన్న వారికి తగిన న్యాయమైన చేయడం జరుగుతుందని కలెక్టర్ వారికి చూచించారు. ఈ ప్రాంతంలో ఎక్కువుగా మట్టిని తీసుకెళుతున్నా రని, అడ్డు చెప్పడంతో మాపై దౌర్జన్యం చేస్తున్నారని అక్కడ ఉన్న ప్రజలు కలెక్టర్‌కు చెప్పగా, కలెక్టర్ జెసి, కమిషనర్ మట్టి తవ్వకాల ప్రాంతాలను పరిశీలించి, ఇకపై ఎవ్వరైనా మట్టిని తరలించే వారిపై క్రిమినల్ కేసులు పెట్టడం, కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మట్టిని తరలించు కుండా చర్యలు తీసుకోవాలని తహశీల్దార్‌ను, విఆర్ఓను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తుడా ఎస్ఈ కృష్ణారెడ్డి, ల్యాండ్ అక్విటెన్స్ అధికారిణి సుజన, ఈఈ రవీంద్రయ్య, టిపిఓ దేవికుమారి, ఆర్‌డిఓ, డిప్యూటీ కలెక్టర్, రామ్‌మోహన్, తహశీల్దార్ భాగ్యలక్ష్మి, డిటి అశోక్, విఆర్ఓలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## చంద్రప్రభ వాహనంపై దర్బార్ కృష్ణుడు

8లో



మలయప్ప స్వామి చంద్రప్రభ వాహనంపై దర్బార్ కృష్ణుని అలంకారంలో తిరుమల నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులను అనుగ్రహించారు. "పురుషోత్తమ ప్రాప్తియాగం" చంద్రుడిని శ్రీ మహా విష్ణువు రూపుగా వర్ణిస్తుంది.

## తక్కువ ధరలకే వంట నూనెలు

### జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్



**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** మార్కెట్ ధరల కంటే తక్కువ ధరలకే వంట నూనెలు వినియోగదారులకు అందజేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. గురువారం ఉదయం జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌తో కలసి తిరుపతి పట్టణంలోని బేరు వీధిలోని గోపికృష్ణ ఆయిల్‌స్టోర్‌లో రూ.135ల పామయిల్‌ను రూ.117లకు, రూ.145ల సన్‌ఫ్లవర్ ఆయిల్‌ను రూ.128లకు వినియోగదారులకు కలెక్టర్, జాయింట్ కలెక్టర్ కలసి పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పట్టణంలోని రైతు బజార్లు, పెద్ద సంస్థాగత రిటైల్ దుకాణాలలో సరసమైన ధరలలో నాణ్యమైన సరకుల వినియోగదారులకు అమ్మకం చేయాలన్నదే ప్రభుత్వ యొక్క ముఖ్య ఉద్దేశమని తెలిపారు. వినియోగదారుల వ్యవహారములు ఆహార మరియు పౌరసరఫరాల శాఖ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాల మేరకు తిరుపతి పట్టణంలో గోపికృష్ణ ఆయిల్ స్టోర్స్, ఎస్ఎస్ ఆయిల్‌స్టోర్స్ ఎస్ఎస్‌బ్రదర్స్, అమర, మురుగన్, సీత ఎంటర్‌ప్రైజెస్, భాస్కర, వాసవి ఆయిల్ స్టోర్స్, మంగళం రోడ్డులోని డిమార్ట్, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో రిలయన్స్ మార్ట్‌లలో లీటర్ 135 రూపాయలు ఉన్న పామాయిల్‌ను 117 రూపాయలకు, 145 రూపాయలు ఉన్న సన్ఫ్లవర్ ఆయిల్ లీటరు 128 రూపాయిలకు గురువారం నుండి వినియోగదారులు పై స్టోర్స్‌లలో కొనుగోలు చేసుకోవచ్చని జిల్లా పౌరసరఫరాల అధికారి శేషాచలం రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ జయరామ్, ప్రతాప్,గోపీకృష్ణ ఆయిల్ స్టోర్ ఓనర్, వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.



## పల్లె పండుగ వారోత్సవాలను విజయవంతం చేయాలి

**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** ఈనెల 14వ తేది నుండి అక్టోబర్ 20వ తేదిలలో వారం రోజుల పాటు పంచాయతీలలో 2024-2025 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులు, పూర్తి అయిన పనులు, లేబర్ బడ్జెట్ వంటి సమాచారంను సిటీజన్ ఇన్ఫర్మేషన్ బోర్డుల ద్వారా ప్రభుత్వ కార్యాలయంల వద్ద, జన సమూహాలా వద్ద ప్రదర్శించి,గ్రామీణ మౌలిక వసతులు అయినటువంటి సిమెంట్ రోడ్లు, సిమెంట్ డ్రైన్స్,మినీ గోకులంలు, రైతుల పొలాలలో ఫారం పాండ్ త్రవ్వకం, కొత్తగా చెప్పటబోవు పనులకు ప్రజా ప్రతినిధులు ద్వారా భూమి పూజా కార్యక్రమంలను పెద్ద ఎత్తున చేపట్టాలని ఎంపీడీవో చంద్రమౌళి తెలిపారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీ వారోత్సవాలు కార్యక్రమాన్ని పండగ వాతావరణంలా నిర్వహించాలని ఈ కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులు విజయవంతం చేయాలన్నారు.

## ఇసుక ట్రాక్టర్లపై కేసు నమోదు

**పెళ్లకూరు, మేజర్‌న్యూస్:** మండలంలోని పుల్లూరు కలవకూరు స్వర్ణముఖి నది ఏరు నుండి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న కొనతనేరి ఇసుక ఇసుక ట్రాక్టర్ లను స్థానిక ఎస్సై నాగరాజు పట్టుకొని స్టేషన్‌కి తరలించారు. పోలీసుల కథనం మేరకు మండలంలోని పుల్లూరు సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని సమాచారం అందడంతో హుటా హుటిన స్వర్ణముఖి ఏరు వద్దకు చేరుకొని రెండు ఇసుక ట్రాక్టర్ లను పట్టుకొని వాటి పైన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## దుర్గాదేవి అలంకరణలో మహాలక్ష్మమ్మ



**వాకాడు, మేజర్‌న్యూస్:** దుర్గాదేవి ధైర్యానికి ప్రీతికగా నిలిచి నవరాత్రుల్లో ఎనిమిదో రోజు అయిన విశేషంగా దర్శనమిచ్చింది. గురువారం గంగన్న పాలెం గ్రామం లోని వెలసి ఉన్న మహాలక్ష్మమ్మ అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ప్రధాన అర్చకులు అయోధ్య బాలచంద్ర శెట్టి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు ఘనంగా నిర్వహించారు, భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

## ఆర్టీసీ వైస్ చైర్మన్‌కి గజమాలతో సన్మానం

**శాంతిపురం, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్టీసీ వైస్ చైర్మన్‌గా నియమింపబడ్డ పి ఎస్ మునిరత్నంను తెలుగుదేశం పార్టీ నాయకులు గజమాలతో సత్కరించి సన్మానించారు. టిడిపి నాయకులు మాట్లాడుతూ 40 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగి మచ్చలేని నాయకుడు మునిరత్నం అని నియోజవర్గంలో తెలుగుదేశం పార్టీ



అభివృద్ధి, కార్యకర్తల అభివృద్ధి కొరకు అన్ని విధాలుగా పాటుపడిన మంచి నాయకుడని నాయకులు కొనియాడారు. ఆయన మాట్లాడుతూ ముఖ్య మంత్రి విజనరీ లీడర్ నారా చంద్రబాబు నాయుడు యొక్క ఆశీస్సులతో నాకు ఈ అవకాశం దొరికిందని నా శాయశక్తుల నారా చంద్రబాబు నాయుడుకు, కుప్పం నియోజకవర్గానికి, తెలుగుదేశం పార్టీ కొరకు ప్రజలకు ఉపయోగంగా ఉండే మంచి పనులను చేస్తానని పిఎస్.మునిరత్నం అన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జి ఆర్ఎస్.మని, మాజీ ఏఎంసీ డైరెక్టర్ బసవరాజు, రాళ్ళ బూదుగూరు పార్టీ ప్రెసిడెంట్ జయరాజు, వార్డ్ మెంబర్ రామప్ప, సీనియర్ నాయకులు కుమార్, జిఎస్ రఘుపతి, తెలుగుదేశం పార్టీ నాయకుల పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో నెల్లూరు వాసి మృతి

**పెళ్లకూరు, మేజర్‌న్యూస్:** గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నెల్లూరు వాసి మృతి చెందిన ఘటనమండలంలోని చిల్లకూరు వడ్డిపాలెం గ్రామం వద్ద నాయుడుపేట పూతలపట్టు 71 వ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై కె.నాగరాజు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదాన్ని పరశీలించారు. ఎస్సై తెలిపిన వివరాలు మేరకు మండలంలోని చిల్లకూరు వడ్డిపాలెం వద్ద ప్లైవుడ్ లోడ్‌తో నెల్లూరు నుండి తిరుపతి కి వెళ్తున్న మినీ వ్యాన్ కాళహస్తి వైపు నుండి కృష్ణపట్నం పోర్ట్‌కు వెళ్తున్న లారీ ఎదురుగా రెండు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో మినీ వ్యాన్ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు నెల్లూరు పట్టణానికి చెందిన కోటా చక్రవర్తిగా (57) గుర్తించారు. దీంతో ఎస్సై కే నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వ చర్యలు

### ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్



**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటి, ఎలక్ట్రానిక్స్ రంగంలో విస్తృతంగా ఉద్యోగ, ఉపాధ్యాయ అవకాశాలు కల్పించడంతో పాటు గ్రామ స్థాయిలోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం ప్రణాళిక బద్ధంగా పనిచేస్తుందన్నారు. ఇందులో భాగంగానే టాటా కన్సల్టెన్సీ సర్వీస్ విశాఖపట్నంలో డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చిందన్నారు. రాష్ట్ర మంత్రి నారా లోకేష్ చేసిన కృషి ఫలితంగా టాటాసంస్థ విశాఖలో తమ డెవలప్మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి ముందుకు రావడం శుభపరిణామన్నారు. రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడడంతో ఐటీ, పారిశ్రామిక రంగానికి మంచి రోజులు వచ్చాయని ఫలితంగా ఐటీ కంపెనీలు, పారిశ్రామికవేత్తలు ఏపీ వైపు వస్తున్నారని చెప్పారు. ఇదే సమయంలో క్షేత్రస్థాయిలో గ్రామాల్లో ఉపాధి అవకాశాలు కల్పించడంలో భాగంగా ఈనెల 14వ తేదీ నుంచి "పల్లె పండుగ" కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేపడుతున్నట్లు తెలిపారు.

## ఘనంగా కర్ణాటక కళశ్రీ విద్వాన్ వానరాశి బాలకృష్ణ భగవతార్ కీర్తనలు

### త్వరలో కుప్పంలో కైవారం తాత విగ్రహ ప్రతిష్టాపనకు చర్యలు

**కుప్పం, మేజర్‌న్యూస్:** కుప్పం రామచంద్ర రోడ్డులో నెలకొనియున్న విశ్వ దుర్గా పరమేశ్వరి అమ్మవారి దసరా నవరాత్రుల సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. "కర్ణాటక కళ శ్రీవిద్వాన్ వానరాశి బాలకృష్ణ భగవతార్ కుప్పంకి విచ్చేశారు. సద్గురు యోగి నారాయణ బలిజ సేవా ట్రస్ట్ సభ్యులు, స్థానిక ప్రజలు ఘన స్వాగతం పలికారు. మొదటగా ప్రసన్న తిరుపతి గంగమ్మదేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సద్గురు యోగి నారాయణ కైవారం తాత విగ్రహ ప్రతిష్టాపనకు కుప్పం చెరువుకట్టపై, బైపాస్‌లోని విజలాపురం క్రాస్ వద్ద స్థల పరిశీలన చేశారు.రామచంద్ర రోడ్డులో నెలకొన్న విశ్వదుర్గా పరమేశ్వరి అమ్మవారి దసరా నవరాత్రు లలో భాగంగా కర్ణాటక కళ శ్రీవిద్వాన్ వానరాశి బాలకృష్ణ భగవతార్ " శ్రీ కైవారం తాత కీర్తనలు వారి చే కార్యక్రమం నిర్వహించారు. భక్తులు, స్థానిక ప్రజలు పెద్దసంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తాదులెల్లరు సాయంత్రం 7గంటలకు విచ్చేసి ప్రజలందరిని కష్టాల నుండి కాపాడి వారికి సిరిసంపదలు కలగజేయాలని సరస్వతి దేవిని దర్శించి



అమ్మవారి కృపాకటాక్షములకు పాత్రలయ్యారు. ఈ కార్యక్రమంలో శ్రీ విశ్వ దుర్గా పరమేశ్వరి భక్త మండలి సభ్యులు, డాక్టర్ సురేష్ బాబు, ఐఆర్ఎం కళాశాల ఛైర్మన్ దయానిధి, శ్రీ సద్గురు యోగి నారాయణ బలిజ సేవా ట్రస్ట్ అధ్యక్షులు ప్రభాకర్, వెంకటరమణ బాబు (పాలు బాబు), మాజీ సర్పంచ్ గోపీనాథ్, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ సత్యేంద్ర శేఖర్, టిడిపి నాయకులు రాజారాం, కౌన్సిలర్ సోమశేఖర్, కొత్త పేట కన్నన్ ట్రస్ట్ నంబర్ త్రివేణి, అనసూయమ్మ, సుగుణమ్మ, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## భారత్ అంటే దేశం కాదు ఒక బ్రాండ్ అని నిరూపించిన మహోన్నత వ్యక్తి రతన్ టాటా



**ఎస్ఆర్.పురం, మేజర్‌న్యూస్:** భారత్ అంటే దేశం కాదు ఒక బ్రాండ్ అని నిరూపించిన మహోన్నత వ్యక్తి రతన్ టాటా అని గంగాధర్ నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అన్నారు. గురువారం రతన్‌టాటా మరణ వార్త తెలుసుకున్న గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ రతన్ టాటా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే డాక్టర్ థామస్ మాట్లాడుతూ డబ్బులు బాగా సంపాదించాలనే లక్ష్యంగా చాలామంది వ్యాపారంలోకి అడుగు పెడుతూ ఉంటారు కానీ రతన్ టాటా అందుకు భిన్నం. మనం చేసే ప్రతి పనిలో సమాజానికి ఏదో ఒక రకంగా ఉపయోగపడాలని తపన పడే వారు రతన్ టాటా. రతన్ టాటా ఇకలేరనే వార్త విని సామాన్యుల నుంచి సంపన్నుల వరకు విషాదాన్ని మిగిల్చిందని ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అన్నారు. రతన్ టాటా మనసున్న మహారాజుగా ఎల్లప్పుడూ ప్రజల మనసులో చిరస్మరణీయంగా ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ థామస్ తెలిపారు.

## హత్య కేసులో ఇద్దరు ముద్దాయిలకు జీవిత ఖైదు

### ఒక్కొక్కరికి రూ.10వేలు జరిమానా

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** ఏర్పేడు పోలీస్ స్టేషన్ పరిధిలో వడమాలపేట బాపూజీ ప్రైమరీ స్కూల్ దగ్గర నివాసముంటున్న రెండు కుటుంబాలు ఇంటి దారి విషయమై బాధితుడు పులుసు మునుస్వామితో అన్నదమ్ములైన నిందితులు తంబి కుమారస్వామి, తంబి నేపాల్, తంబి పవన్ గొడవపడ్డారు. ఈ క్రమంలో నిందితులు బాధితున్ని కింద పడేసి గుండెలపై బలంగా కొట్టడంతో బాధితుడు పులుసు మునస్వామి గుండెలో నొప్పి అంటూ కుప్పకూలి పడిపోయాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అక్కడే మరణించాడు. ఈ విషయంపై పులుసు మునస్వామి తమ్ముడు పులుసు ఢిల్లీ ఇచ్చిన ఫిర్యాదుపై కేసుగా నమోదు చేసి, పోలీసులు దర్యాప్తు చేపట్టి, కోర్టులో ఛార్జ్ షీటును దర్యాప్తు అధికారి ఫైల్ చేశారు. కోర్టులో విచారణకు వస్తూ ఈ రోజు తుది విచారణలో నిందితులు ఇద్దరూ దురుద్దేశంతోనే బాధితుడిని హతమార్చినట్లు రుజువు కావడంతో ఏ1 తంబి కుమారస్వామి(44) తండ్రి టి.గురవయ్య, ఏ2 తంబి నేపాల్ (31) తండ్రి టి. గురవయ్యలకు ఒక్కొక్కరికి యావజ్జీవ కఠిన కారాగార శిక్ష మరియు రూ.10వేలు జరిమానా విధించారు. ఒకవేళ నేరస్తులు రూ.10వేలు చొప్పున జరిమానాను చెల్లించని యెడల ఒక సంవత్సరం సాధారణ జైలు శిక్ష అదనంగా అనుభవించాలని, శ్రీకాళహస్తి 12వ అదనపు జిల్లా కోర్టు జడ్జి ఎం.శ్రీనివాసులు నాయక్ ఈరోజు తీర్పును వెలువరించారు.

## చక్రస్నానం ఏర్పాట్లపై టీటీడీ ఈఓ తనిఖీలు

**తిరుమల, మేజర్‌న్యూస్:** ఈనెల 12న నిర్వహించనున్న చక్రస్నానం ఏర్పాట్లపై టీటీడీ ఈఓ శ్యామలరావు అధికారులతో కలసి గురువారం శ్రీవారి పుష్కరిణీ వద్ద తనిఖీలు నిర్వహించారు. ప్రవేశ మార్గాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, పోలీసులు, విజిలెన్స్ సిబ్బంది, శ్రీవారి సేవకులను సమన్వయం చేసుకుని చక్రస్నాన సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఈఓ సీహెచ్.వెంకయ్య చౌదరి, జేఈఓలు వీరబ్రహ్మం, గౌతమి, తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు, టీటీడీ సీవీఎస్వో శ్రీధర్ పాల్గొన్నారు.



## దుర్గాదేవి అలంకరణలో రాజరాజేశ్వరి దేవి



**వెదురుకుప్పం, మేజర్‌న్యూస్:** అరుణగిరి క్షేత్రంలో వెలసి ఉన్న రాజరాజేశ్వరి దేవి ఆలయంలో గురువారం శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు దుర్గా దేవి అలంకరణలో రాజరాజేశ్వరి దేవి భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యనిర్వహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అరుణగిరి క్షేత్రం విద్యుత్ దీపాలంకరణలతో మెరిసిపోయింది.

## దుర్గాదేవి అలంకరణలో గ్రామ దేవతలు

**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** కార్వేటి నగరంలో వెలసిన గ్రామ దేవత బంగారమ్మ, డైట్ సమీపంలో ఉన్న అంకాల పరమేశ్వరి, స్కంద పుష్కర్ణి వద్ద వెలసిన రాజరాజేశ్వరి, డిఎం.పురం పంచాయతీ పాత దేరాకండిగా గ్రామం వద్ద వెలిసిన నేనేరమ్మ, రాజ బంధువుల వీధిలో వెలసిన రాజరాజేశ్వరి ఆలయాల్లో గురువారం ఉదయం అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉభయదాతలుగా వరలక్ష్మీ మురహరినాయుడు, వెంకటేశ ఆచారీ, నైనేరీ సుగుణ, ఆముదాల మురళి ఆరు ముగం ఆలయం చుట్టూ విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటు చేశారు, ఆలయం దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ అధ్యక్షులు, ప్రసాద్, చంద్రశేఖర్ పిళ్ళై, మంజునాథ్ వర్మ, ప్రభు జగదీష్, ఆనంద్, బాలుస్వామి కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.



## సీసీ రోడ్డుకు భూమి పూజ



**పెద్దపంజాణి, మేజర్‌న్యూస్:** మండలంలోని రాజుపల్లి గ్రామంలో పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి రూ.2లక్షలతో మంజూరు చేసిన సీసీరోడ్డుకు గురువారం రాజుపల్లి పంచాయతీ తెలుగుదేశం పార్టీ నాయకులు భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్ర మంలో మాజీ జిల్లా తెలుగుయువత ప్రధాన కార్యదర్శి భానుప్రతాప్ రెడ్డి, మంజునాథరెడ్డి, గౌతంరెడ్డి, బాలకృష్ణారెడ్డి, ప్రవీణ్ కుమార్, గణేష్, నాగరాజ్, చందు, నందగోపాల్ రెడ్డి, జయపాల్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, యశ్వంత్ రెడ్డి, బద్రి, ఆది, మునీంద్ర, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

## డ్రీమ్ మొబైల్ షోరూం ప్రారంభించిన ఎమ్మెల్సీ

**కుప్పం, మేజర్‌న్యూస్:** పట్టణంలోని ఎంఆర్డీ సర్కిల్‌లోని డ్రీమ్‌మొబైల్ షోరూం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పాల్గొన్నారు. వారికి, షోరూం యజమాని గోవింద్ పుష్ప గుచ్ఛం అందజేసి ఘనస్వాగతం పలికారు. అనంతరం వారు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కుప్పం నియోజకవర్గ మైనార్టీ విభాగం అధ్యక్షులు జాకీర్ తదితరులు పాల్గొన్నారు.



## ఉచిత కంటి వైద్య శిబిరం



**డక్కిలి, మేజర్‌న్యూస్:** పెళ్లకూరు చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని తిరుపతి శ్రీవెంకటేశ్వర అరవింద్ నేత్రాలయం వారి సహకారంతో డక్కిలి మండలం కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేశామని మేనేజింగ్ డైరెక్టర్ చాగణం గౌరిశంకర్, సీఈఓ సీతారామ్ నాయుడు తెలిపారు. వారు మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలకు సీనియర్ వైద్య నిపుణులైన అనుభవం గల స్పెషలిస్ట్ డాక్టర్ల ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి తగు సలహాలు, సూచనలు ఇచ్చారన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో 120 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి 50 మందికి ఉచితంగా మందులు, 30 మందికి ఉచిత కంటి అద్దాలు, 22 మందికి ఉచితంగా ఆపరేషన్‌లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఏఓ కృష్ణ గల్లా, అరవింద్ నేత్రాలయ సిబ్బంది జీవన్‌లు పాల్గొన్నారు.

## పల్లె పండుగను జయప్రదం చేద్దాం... ఎమ్మెల్యే

**గూడూరు, మేజర్‌న్యూస్:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పల్లె పండుగను ప్రతి ఒక్కరూ జయప్రదం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ కోరారు. గురువారం మధ్యాహ్నం పార్టీ కార్యాయలంలో పంచాయతీరాజ్ శాఖ అధికారులు, నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం గ్రామాల సర్వతోముఖ అభివృద్ధికి చేపడుతున్న అభివృద్ధి పనులతో దశ, దిశ మారుతుందన్నారు. సిమెంట్ రహదారులు, మురుగు కాల్వలు నిర్మాణంతో గ్రామాల అభివృద్ధికి దోహ దపడతాయన్నారు. ఈ సమావేశంలో పిఆర్ అధికారులు, తెలుగుదేశం నాయకులు వెంకటేశ్వర్లురాజు, ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, కిషోర్‌నాయుడు, పిఆర్ అధికారులు పాల్గొన్నారు.



# జిల్లా కలెక్టర్ గారూ.. ఈ రహదారులు పట్టించుకోరా..!

**ప్రమాదాలు జరిగితే గాని పట్టించుకోని అధికారులు....**
**నిద్రావస్థలో ఆర్ అండ్ బి అధికారులు**
**రోడ్డు మరమ్మతులు అంటేనే ప్రజాప్రతినిధులకు పట్టదా..?**

**పెనుమూరు, మేజర్‌న్యూస్:** జిల్లా పాలనాధికారి మండల కేంద్రమైన పెనుమూరు – చిత్తూరు రహదారుల మరమ్మతులు పనులను పట్టించుకోరా అంటూ పెనుమూరు మండల ప్రజలు వాపోతున్నారు. రెండు, మూడు పర్యాయాలు పెనుమూరు మండలానికి వచ్చిన జిల్లా కలెక్టర్లకు ఈ రహదారుల దుస్థితిపై కనికరం లేదా అంటూ మండల ప్రజలలో విమర్శలు వినిపిస్తున్నాయి. నిద్రావస్థలో ఉన్న ఆర్ అండ్ బి అధికారులపై జిల్లా పాలనాధికారి దృష్టి ఏ మాత్రం ఉందంటే ఈ రోడ్డు మరమ్మతులు నోచుకోనట్లు. రహదారులు బాగుంటే ప్రయాణికులు తమ గమ్యాన్ని క్షేమంగా చేరుకుంటారు. అయితే రహదారులపై ప్రయాణించాలంటే ప్రయాణికులకు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకునే దుస్థితి అధికారులు తీసుకొచ్చారు. చిత్తూరు పట్టణం నుండి పూణేపల్లి, కలవగుంట, మఠంపల్లి, సాతంభాకం, వడ్డీ గుడ సెలు, పెద్దరాజుపల్లి వరకు రహదారులు గుంతల మయంగా మారి, దుమ్ము ధూళి మీద ప్రయాణించాలంటే నరకయాతన పడుతున్నారు. రోడ్లపై గుంతలు లోతుగా ఉండడంతో ఆ గొంతులో వాహనాలు వెళ్లడంతో వాహనాలు దెబ్బతింటున్నాయని వాహనదారులు ఆందోళనకు గురవుతున్నారు. దీనికి తోడు రోడ్డుకిరువైపులా ముళ్ళపొదలు రోడ్డుపైకి రావడంతో మలుపుల వద్ద సూచిక బోర్డులు లేక చాలా ప్రమాదాలు జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయి. మండల కేంద్రం పెనుమూరు నుండి చిత్తూరు పట్టణానికి వెళ్లే మార్గమధ్యంలో సాతంభాకం పరిసర ప్రాంతంలోని గంగుపల్లె చెరువు చెక్‌డ్యాం పక్కన ఉన్న రోడ్డు మరమ్మతులకు గురయింది. అయితే గత వారం రోజుల క్రితం రాత్రి వివాహానికి వెళ్లి తిరిగి వెళుతున్న కర్ణాటక కుటుంబీకుల కారు అదుపు తప్పి బోల్తా పడడంతో తీవ్ర గాయాలతో బయటపడ్డారు.



గతంలో భారీ వర్షాల వలన రోడ్లు తీవ్రంగా దెబ్బతినడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పెనుమూరు నుండి చిత్తూరు ఒక గంట సమయం పడితే, ఇప్పుడు ఆ రహదారిపై వెళ్లాలంటే సుమారు రెండు గంటల సమయం పడుతోంది. ఇదిలా ఉండగా గర్భిణీ స్త్రీలు చిత్తూరు పట్టణానికి వెళ్లాలంటే ఈ రహదారిపై తీవ్రఇబ్బందులకు గురవుతున్నారు. నేంద్రాగుంట నుండి పెనుమూరు మీదుగా వెళ్ళే వాహనాలు తరచూ ఈ రహదారిపై రావడంతో ట్రాఫిక్ ఇబ్బందులు కాకుండా, చిన్న చిన్న ప్రమాదాలు గురవుతున్నారని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు, రహదారుల మరమ్మతు పట్టదా అని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు..? ప్రతిపక్ష పార్టీలు పాలనా అధికార పార్టీల తీరును నిరసిస్తూ రోడ్డు మరమ్మతులు కూడా చేపట్టని పాలకులు ఎందుకు అంటూ ప్రశ్నిస్తున్న...?అధికారులు కానీ ప్రజాప్రతినిధుల కాని చీమ కుట్టినట్లు లేదు.రహదారుల మరమ్మతు చేయడంలో ఆర్‌ఆర్బీ అధికారుల నిర్లక్ష్యం, తమకేమి పట్టనట్లు నిద్రమత్తులో ఉన్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా పాలనాధికారి స్పందించి రహదార్ల మరమ్మతులు చేపట్టి ప్రయాణికుల ప్రాణాలు కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు ప్రయాణికులు వాహనదారులు కోరుతున్నారు.

## కార్డ్స్ నియోజకవర్గ అధ్యక్షురాలుగా ఉషా

**పుంగనూరు, మేజర్‌న్యూస్:** ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థ సెంటర్ ఫర్ ఆక్ట్స్ అండ్ రైట్స్ డెవలప్మెంట్ సొసైటీ రిజిస్ట్రేషన్ నెంబర్ 133/2024లో పుంగనూరు నియోజకవర్గ అధ్యక్షురాలుగా పబ్బతి ఉషా అనిల్‌ను నియమిస్తూ ఆ సంస్థ అధ్యక్షురాలు ఉత్తరాది గీత నియామకపత్రం జారీచేశారు. అలాగే పుంగనూరు టౌన్ అధ్యక్షులుగా బొగ్గరపు కృష్ణమూర్తి శెట్టిని, పుంగనూరురూరల్ అధ్యక్షులుగా అమరావతి రాజేష్, ఉపాధ్యక్షులుగా రాజేంద్ర, కార్యదర్శిగా అమరావతి రామ్‌కుమార్, కోశాధికారిపబ్బతి అనీల్ కుమార్ లను నియమిస్తూ ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు నుండి నియామక పత్రాలు అందివ్వడం జరిగింది. సంస్థ అధ్యక్షురాలు ఉత్తరాది గీత మాట్లాడుతూ రాను రానూ సమాజం మానవతా విలువలు లేకుండా పోతున్నాయని, ఈ మధ్య అశ్వియా విషయం లో చిన్నపిల్ల అని కూడా చూడకుండా చంపేశారని, అటువంటి వారిని వదిలిపెట్టకూడదని ఆవిడ అన్నారు. అంతే కాకుండా ప్రతి పౌరుడు చట్టం గురించి తెలుసుకొని,తమ హక్కులను కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాది హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## నూతన మద్యం షాపులకు విశేష స్పందన :డీసీ

**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** నూతన మద్యం షాపులకు విశేష స్పందన వస్తుందని డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్ తెలిపారు. గురువారం ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎక్సైజ్ కార్యాలయం పరిధిలో దంఖాస్తు చేసుకునేవారు ఏదైనా వివరాలకు కూడా కార్యాలయం అధికారులను సంప్రదించవచ్చన్నారు. పాలసముద్రం మండలంలోని షాపుకు ఎక్కువ దరఖాస్తులు వస్తున్నాయని మిగిలిన షాపులకు కూడా దరఖాస్తులు వస్తున్నాయని తెలిపారు. ఇతర వివరాలకు టోల్ ఫ్రీ నెంబర్‌కి సంప్రదించవచ్చు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిఐ శిరీష దేవి, ఎస్సైలు శ్రావణ్ తేజ్, మోసెస్ సిబ్బంది పాల్గొన్నారు.




## చెడుపై సాధించిన విజయమే విజయదశమి

**తిరుపతి రెవెన్యూ, మేజర్‌న్యూస్:** రాష్ట్రీయ సేవా సమితి (రాస్) మహిళా పొదుపు సంఘాల ఆధ్వర్యంలో కోర్లగుంట శ్రీప్రసన్న భారతి స్కూల్ నందు సంజయ్ గాంధీ కాలనీ మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో,ఆధ్యాత్మిక శోభను సంతరించే విధంగా, కనుల పండుగగా వినులు వీక్షించే విధంగా, దుర్గాదేవి నామస్మరణతో వేద పండితుల మంత్రాలతో, సామూహిక దసరా మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిధిగా విచ్చేసిన రాస్ ప్రధానకార్యదర్శి డాక్టర్ యస్.వెంకటరత్నం మాట్లాడుతూ విజయానికి చిహ్నంగా జరుపుకునే పండుగ దసరా పండుగ అని తెలిపారు, రాక్షసలను సంహరించడానికి దేవతలు సృష్టించిన అమ్మవారే దుర్గాదేవి అని ఇతివృత్తాన్ని వివరించడం జరిగింది. ఈ పర్వదినాల్లో అమ్మవారు ఒక్కొక్క రోజు ఒక్కొక్క అవతారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకొనడం వలన జీవితాలకు మంచి జరుగుతుందన్నారు. సృష్టికి మూలమైన మహిళలు సామూహికంగా వ్రతాలు, పూజలు, కైంకర్యాలు క్రతువులు చేయడం వల్ల సమ సమాజ అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ప్రసన్న భారతి స్కూల్ చైర్ పర్సన్ ఈశ్వరమ్మ మాట్లాడుతూ రాస్ చేస్తున్న వివిధ సేవా కార్యక్రమాలు ముఖ్యంగా మహిళల్లో చైతన్యం కోసం, మహిళా సాధికారత కోసం వీరి కృషి అభినందనీయం అన్నారు. రాస్ మహిళా పొదుపు సంఘాల ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.నాగరాజు మాట్లాడుతూ లింగ వివక్షత లేకుండా పిల్లలను బాగా చదివించాలని తెలిపారు. సామూహికంగా పూజలు చేయడం వల్ల వారిలో మానసికస్థైర్యం, ఓర్పు, మెర్పు, సహనం, తీర్పు, అంకితభావం వారి కుటుంబాలకు ఉపయోగపడతాయన్నారు. సభ్యులు చేపట్టే వివిధ వ్యాపార కార్యక్రమాలను రుణాల అందించడం జరుగుతుంది అని తెలిపారు. అనంతరం నిరుపేదలకు చేతి కర్రలు దుప్పట్లు, రెండు, మూడు చక్రాల సైకిళ్లు, వినికిడి పరికరాలు అందించామన్నారు. పిల్లలు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం అందరిని ఆకట్టుకొన్నవి. ఈ కార్యక్రమంలో నాగేశ్వర్, వాణి, రామాంజులు, సీతమహాలక్ష్మి క్లస్టర్ లీడర్లు, దేవి, కవిత, 250 మంది మహిళలు పాల్గొన్నారు.





## “గుడ్‌బుక్” రాస్తానని జగన్ చెప్పడం శుభపరిణామం

**- కూటమి ప్రభుత్వం తరపున పెన్ను,నోటు పుస్తకం పంపుతాం**
**- బీజేపీ అధికార ప్రతినిధి భాను ప్రకాష్ రెడ్డి**

**తిరుపతి ప్రెస్‌క్లబ్, మేజర్‌న్యూస్:** నిన్నటి రోజున మాజీ ముఖ్యమంత్రి, పులివెందుల ఎమ్మెల్యే, వైసిపి అధినేత అయినటువంటి జగన్మోహన్ రెడ్డి.. తాను కూడా “గుడ్‌బుక్” రాస్తానని ఓ విలేకరుల సమావేశంలో చెప్పడం శుభ పరిణామమని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి భాను ప్రకాష్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పుస్తకాలను చదవడం, రాయడం మంచి అలవాటు అన్నారు. గత ఐదేళ్ల జగన్ పాలనలో అవినీతి,అక్రమాలు,అరాచకాలకు పాల్పడ్డ వైసీపీ నాయకులు, అధికారుల పేర్లను టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ తన “రెడ్ బుక్” లో రాసుకున్నారు. కానీ ప్రస్తుత ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతున్నాయి. గుడ్ బుక్ రాయడానికి జగన్ కు ఏమీ లేదని, ఒకవేళ రాయాలని అనుకుంటే..తన ఆత్మకథ రాసుకోవాలని,అందులో ఆయన రక్త చరిత్ర,బాబాయి గుండెపోటు గొడ్డలి పోటుగా ఎలా మారింది,కోడి కత్తి డ్రామా, గులకరాయి డ్రామా అనే విషయాలపై రాసుకుంటే మంచిదని అభిప్రాయపడ్డారు. కూటమి ప్రభుత్వం రాగానే జరుగుతున్న ప్రజాపాలనను చూసి ఓర్చుకోలేక, కడుపు మంట తగ్గడానికి “జెలుసెల్” సిరప్ తాగినా తగ్గకపోవడంతో.. 30 రోజుల్లోనే ఢిల్లీ వెళ్లి ఆంధ్రప్రదేశ్ లో రాష్ట్రపతి పాలన కావాలని ధర్నా చేశారని మండిపడ్డారు.జగన్ ఆత్మకథ రాసుకోవడానికి బిజెపి తరఫున నోటు పుస్తకాలు,పెన్నులు,కడుపు మంట తగ్గడానికి “జెలుసెల్” సిరప్‌లు పంపుతామని ఎద్దేవా చేశారు.2019కి ముందు అన్నపూర్ణ ప్రదేశ్ గా ఉన్నటువంటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని.. జగన్ వచ్చాక అప్పుల ప్రదేశ్, అంధకార ప్రదేశ్, అరాచక ప్రదేశ్ గా మార్చారని దుయ్యబట్టారు. ప్రస్తుతం చంద్రబాబు సీఎంగా రాష్ట్రాన్ని “స్వర్ణాంధ్రప్రదేశ్”గా తీర్చి దిద్దుతున్న తరుణంలో..అవినీతికి చిరునామా వైసీపీ పాలన అయితే, అభివృద్ధి, సంక్షేమానికి చిరునామా ఎన్డిఏ పాలన అని రాష్ట్ర ప్రజలు అభిప్రాయపడుతున్నారని అన్నారు.జగన్ చెప్పినట్లు దుర్మార్గపు పనులు చేసిన ముగ్గురు ఐపీఎస్ లు సస్పెండ్ అయ్యారని, ఇంకా పదుల సంఖ్యలో సస్పెండ్ కావడానికి ఐపీఎస్ లు క్యూలో ఉన్నారని తెలిపారు. గుడ్ బుక్ రాస్తానని జగన్ చెప్పడం 2024 లో బెస్ట్ జోక్ అని గేలి చేశారు.గుడ్ బుక్ లో రాసుకోవడానికి జగన్మోహన్ రెడ్డికి ఏమీ లేదని,ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను రాసుకోవాలే తప్ప, మా మంచి పనులను ఇతరులు చెప్తుంటే వినాలి తప్ప..ఆయన రాసుకోవడానికి కూటమి ప్రభుత్వం ఏమాత్రం అవకాశం ఇవ్వదని స్పష్టం చేశారు. తమ ఎన్డీఏ ప్రభుత్వం ఏకైక లక్ష్యం.. సీమాంధ్రను స్వర్ణాంధ్ర చేయడమేనని, దీనికి కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం అన్ని విధాల ఆర్థికంగా సహకరించి ఆదుకోవడానికి సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.విజయవాడలో వరదల కారణంగా లక్షలాదిమంది ప్రజలు ఇబ్బంది పడ్డారని,వారికి రాష్ట్రంలోని ఎందరో మనసున్న దాతలు కోట్లాది రూపాయలను విరాళం అందజేసి సహాయపడ్డారు.ఐదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన జగన్ రెడ్డి మాత్రం పేరుకు కోటి రూపాయలు ప్రకటించి.. ఇప్పటివరకు ముఖ్యమంత్రి సహాయ నిధికి ఒక రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. ఆఖరుగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లు కళ్ళు మూసుకుంటే.. తిరిగి తాము అధికారంలోకి వస్తామని చెప్పడం హాస్యాస్పదమని, ఇప్పటికైనా జగన్మోహన్ రెడ్డి పగటి కలలు కనడం మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి వరప్రసాద్, నేతలు డాక్టర్ శ్రీహరి రావు,సుబ్బు యాదవ్,అజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## సూర్యప్రభ వాహనంపై అనంత తేజోమయుడు..



**తిరుపతిరూరల్, మేజర్‌న్యూస్:** తుమ్మల గుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాలలో ఏడవరోజు శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వారు అనంత తేజోమయుడుగా సూర్యప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చాడు. బ్రహ్మోత్సవాలలో ప్రతి ష్టాత్మకమైన సూర్య ప్రభ వాహన విశిష్టతను ఇప్పుడు తెలుసుకుందాం. సప్తమి – సూర్యప్రభ వాహనం హిందూ సంప్రదాయం ప్రకారం సప్తమి తిథి సూర్య భగవానుని ఆరాధనకు శ్రేష్టమైనది. అక్టోబర్ 10 వ తేదీ గురువారం సూర్యోదయ సమయాన ఆశ్వయుజ సప్తమి తిథి ఉన్నందున శ్రీనివాసునికి సూర్య ప్రభ వాహన సేవ జరుగుతుంది. శ్రీనివాసుడే సూర్యనారాయణుడు వజ్ర కవచం ధరించి ఉదయ భానుని కిరణాలు ప్రసరిస్తుండగా గ్రామంలో ఊరేగుతూ సూర్య మండలం మధ్యనున్న నారాయణమూర్తిని నేనే అని భక్తులకు ప్రభోదించడమే ఈ వాహనసేవ పరమార్థం.

**చంద్రునిపై.. చల్లనయ్య..**

శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో ఏడవ రోజు గురువారం రాత్రి శ్రీనివాసుడు చంద్ర ప్రభ వాహనంపై ఊరేగుతూ తన చల్లని దీవెనలను భక్తులకు అందించారు. చంద్రప్రభ వాహన సేవ విశిష్టతను కూడా తెలుసుకుందాం. వాహన సేవల్లో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, చెవిరెడ్డి లక్ష్మీ, కుమారులు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్ రెడ్డిలు వెన్నంటి నడిచారు.

**సూర్య,చంద్రులే నేత్రాలుగా..**

బ్రహ్మోత్సవాలలో ఏడోరోజు శ్రీనివాసుడు ఉదయం సూర్యప్రభ వాహనంపై, రాత్రి చంద్రప్రభ వాహనంపై ఊరేగడం ద్వారా సూర్యచంద్రులు శ్రీవారికి రెండు నేత్రాల వంటి వారని నిరూపించడమే ఈ అవతారం యొక్క పరమార్ధమని శాస్త్రం చెబుతోంది.

**మనశ్శాంతి రోగ నాశనం...**

హిందూ సంస్కృతి ప్రకారం చంద్రుడు మనఃకారకుడు. ఔషధాలను తేజోవంతం చేసే శక్తి కలవాడు. అందుకే చంద్రప్రభ వాహనంపై ఊరేగుతున్న స్వామివారిని దర్శించుకుంటే మానసిక ప్రశాంతత కలుగుతుంది. సమస్త ఔషధీ తత్వంతో రోగ నాశనం జరుగుతుంది. అంతేకాదు చంద్రప్రభ వాహనంపై ఊరేగే స్వామి దర్శనంతో సకల పాపాలు తొలగి, సమస్త సంపదలు సమకూరుతాయని భక్తుల విశ్వాసం.

## టిడ్కో చైర్మన్‌కి వినుత కోటా శుభాకాంక్షలు

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** ఏపీ టిడ్కో చైర్మన్, జనసేన పార్టీ కాన్ఫ్లిక్ట్ మేనేజ్మెంట్ హెడ్ వేములపాటి అజయ్‌కుమార్ తిరుపతి విచ్చేసిన సందర్భంగా నియోజకవర్గం జనసేన పార్టీ ఇంఛార్జి వినుత కోటా, నియోజకవర్గ నాయకులు, జనసైనికులు, వీర మహిళలతో వెళ్లి శుభాకాంక్షలు తెలిపి, దుశ్శాలువతో సన్మానించి, శ్రీకాళహస్తీశ్వర స్వామి తీర్థ ప్రసాదాలు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో టిడ్కో ఇళ్ళ నిర్మాణాలను పరిశీలించి త్వరలో టిడ్కో ఇళ్ళ నిర్మాణాలు పూర్తి చేసి పేదలకు అందించాలని కోరడం జరిగింది.





## చాముండేశ్వరి దర్శించుకున్న సుగుణమ్మ

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్ న్యూస్:** దసరా ఉత్సవాలను పురస్కరించుకొని తుమ్మలగుంట లోనున్న శ్రీ శక్తి చామండేశ్వరి దేవిని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయం వద్దకు చేరుకున్న వారికి ఆలయ ధర్మకర్తలు ఘన స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం అమ్మవారి తీర్థప్రసాదాలు అమ్మవారి చిత్రపటాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నేత దంపురి భాస్కర్ యాదవ్ పాల్గొన్నారు.

## మాజీ సైనికుల సంక్షేమానికి కృషి

**- జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి కె.వి రాఘవులు**

**చిత్తూరుఅర్బన్, మేజర్‌న్యూస్:** మాజీ సైనికుల సంక్షేమానికి కృషి చేస్తానని జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కె.వి రాఘవులు తెలిపారు. గురువారం స్థానిక గిరింపేట నందుగల సైనికుల సంక్షేమ జిల్లా కార్యాలయం నందు బాధ్యతలు స్వీకరించిన అనంతరం రాఘవులు మీడియాతో మాట్లాడుతూ చిత్తూరు జిల్లా పశు సంవర్ధక శాఖలో సూపర్డెంట్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న తనను కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత సాధారణ బదిలీలలో భాగంగా ఉద్యోగన్నతి కల్పిస్తూ నెల్లూరు జిల్లా పశు సంవర్ధక శాఖ ఏడిగా నియమించడం జరిగిందని, ప్రస్తుతం డిప్టేషన్ పై చిత్తూరు జిల్లా సైనిక సంక్షేమ అధికారిగా బాధ్యతలు చేపట్టడం జరిగిందని తెలిపారు. విధి నిర్వహణలో భాగంగా మాజీ సైనికులకు కేంద్ర ప్రభుత్వం నుంచి రావలసిన పెండింగ్ బకాయిలను, అందేలా చర్యలు చేపడతానని తెలిపారు.




## ఏపీ రీసెట్ మొదటి విడత సీట్ల కేటాయింపు

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** రాష్ట్ర విద్యామం డలి ఆధ్వర్యంలో శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం నిర్వహించిన ఏపిఆర్ సెట్ 2023–24 లో ర్యాంకులు పొందిన అభ్యర్థులకు గురువారం మొదట విడత సీట్లు కేటాయించారు. ఈ సందర్భంగా రీసెట్ 2023–24 ఛైర్మన్ ఆచార్య కె.రామ్మోహన్ రావు, కన్వీనర్ ఆచార్య పి.సి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రం లోని 17 విశ్వవిద్యాలయాలో సైన్స్, ఆర్ట్స్, మేనేజ్మెంట్, ఇంజనీరింగ్, ఫార్మసీ వంటి కోర్సుల్లో పిహెచ్.డి. (పార్ట్ టైం, ఫుల్ టైం )2566 సీట్లకు వెబ్ వెరిఫికేషన్ జరిపి సీట్ల కేటాయించామని తెలిపారు. తొలిదశలో ఫుల్ టైం కోర్సుల్లో 771 మంది, పార్ట్ టైం కోర్సుల్లో 1237 మంది, మొత్తం 2008 మందికి కేటాయించమన్నారు. అభ్యర్థులకు వెబ్ ఆప్షన్ల ఆధారంగా సీట్లు కేటాయింపు జరిగిందని పేర్కొన్నారు. సీట్లు కేటాయింపు జరిగిన వారు ఆన్లైన్లో రిపోర్టు చేసి, సంబంధిత విశ్వవిద్యాలయాల్లో నేరుగా ఈనెల 14 నుంచి 19 వరకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరై సీటు ఖరారు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు అభ్యర్థులు వెబ్ సైట్ ను చూడాలని కోరారు.

## శ్రీదుర్గాదేవి అలంకరణలో గంగమ్మ దర్శనం

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం శ్రీతాతయ్యగుంట గంగమ్మ శ్రీదుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈమేరకు ఆలయంలో ఉదయం అమ్మవారికి అభిషేకం, దేవి హోమం, సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం సాయంత్రం అమ్మవారిని శ్రీదుర్గాదేవి, అలంకరణలో కొలువు తీర్చి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు అమ్మవారస దర్శించుకుని పూజలు నిర్వహించారు. కాగా రాత్రి ఆలయంలో అమ్మవారి ఊంజల్ సేవ వేడుకగా చేపట్టారు. అలాగే పూజలో పాల్గొన్న ఉభయదారులకు అమ్మవారి ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ఏ.జయకుమార్, ఆలయ అర్చకులు, సిబ్బంది. భక్తులు పాల్గొన్నారు.





# దేశ పారిశ్రామిక అభివృద్ధిలో రతన్‌ది చెరగని ముద్ర : ఎమ్మెల్యే ఆరణి

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** దేశంలో పారిశ్రామిక అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన రతన్ టాటా చెరగని ముద్ర వేసుకున్నారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. ముంబైలోని బ్రిచ్ క్యాండీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి దివంగతులయ్యారు. టాటా క్యాన్సర్ హాస్పిటల్ లో గురువారం పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా చిత్రపటానికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పూల మాల వేసి ఘన నివాళులర్పించారు. సూది నుంచి విమానాల వరకు విస్తరించిన టాటా గ్రూప్ ను సుస్థిర పరచిన దేశ పారిశ్రామిక రంగ అభివృద్ధిలో రతన్ టాటా చెరగని ముద్ర వేసుకున్న ఘనత ఆయనకే దక్కిందన్నారు. మానవతా దృక్పథంలో కూడా రతన్ టాటా అందరికన్నా ముందు నిలిచి గొప్ప మానవతా వాదిగా నిలిచారని కొనియాడారు. కోవిడ్ సమయంలో 1,500 కోట్లు పిఎం రిలీఫ్ పండు అందించి, విద్యా రంగానికి, స్టార్ట్ అప్ లకు రతన్ టాటా చేయూతనందించారని తెలిపారు. తిరుపతిలో 250కోట్లతో టాటా క్యాన్సర్ హాస్పిటల్ స్థాపించి పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించిన మహోన్నతమైన వ్యక్తి అని అన్నారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, దంపూరి భాస్కర్ యాదవ్, డాక్టర్ ప్రశాంత్, మహేష్ యాదవ్, బాబ్జీ, కేఎంకే లోకేష్, రుయా ఆస్పత్రి అభివృద్ధి సొసైటీ వర్కింగ్ చైర్మన్ బండ్ల లక్ష్మీపతి రాయల్, రమణరాజు రతన్ టాటాకు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

# డొక్కా సీతమ్మ అన్నదానానికి బియ్యం విరాళం



**శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్:** పట్టణంలోని తెట్టు జన సైనికుడు కత్తి మణి కూతురు జన్మదిన సందర్భంగా డొక్కా సీతమ్మ అన్న సమర్పణ కార్యక్రమానికి 2 బియ్యం బస్తాలు ఇవ్వడం జరిగింది. జనసేన పార్టీ ఇంచార్జ్ శ్రీమతి వినుత కోట అతనిని అభినందించి కేక్ కట్ చేయించడం జరిగింది. జనసేన పార్టీ నాయకులు. కార్యకర్తలు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణా ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదు

## - జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్




**తిరుపతి బ్యూరో, మేజర్ న్యూస్:** నూతన ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రజలకు అందుబాటులో పారదర్శకంగా ఇసుక అందేలా, ప్రభుత్వానికి ఇసుక ద్వారా ఎలాంటి ఆదాయం ఆశించకుండా పలు చర్యలు చేపట్టిందని తొందర్లో మూడు డీసిల్టేషన్ పాయింట్ల నుండి సుమారు 1,37,686 మెట్రిక్ టన్నుల ఇసుక స్టాక్ యార్డు పాయింట్ల నందు పారదర్శకంగా ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని, ఇసుక అక్రమ రవాణా ను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. వీరితో పాటుగా జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రజలకు అందుబాటులోకి పారదర్శకంగా ఇసుక అందేలా ప్రభుత్వానికి ఇసుక ద్వారా ఎలాంటి ఆదాయం ఆశించకుండా పలు చర్యలు చేపట్టిందని, ఈ ఉచిత ఇసుక విధానంలో గత మాసాలలో పలు డిపోలు ద్వారా ఇసుక అందుబాటులో ఉంచగా ప్రజలు వినియోగించు కున్నారని తెలుపుతూ జిల్లాలో గుర్తించిన మూడు డీసిల్టేషన్ పాయింట్లలో రెండు పెళ్లకూరు మండలం నందు, మరొకటి గూడలి కోట మండలం నందు ఏర్పాటుకు ప్రభుత్వం నుండి అన్ని అనుమతులు వచ్చాయని అధికారులు తెలుపగా, స్వర్ణముఖి నది పరీవాహక ప్రాంతం నందు తొందర్లో పాలచూర్ అనికట్ అప్ స్ట్రీమ్ పుల్లూరు గ్రామం, పెళ్లకూరు మండలం నందు 1.920 హెక్టార్ లలో 28782 క్యూబిక్ మీటర్లు, 43173 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంటుందని, పాలచూరు అనికట్ డౌన్ స్ట్రీమ్, దిగువ కలువకూరు గ్రామం పెళ్లకూరు మండలం నందు 1.821 హెక్టార్ లలో 27309 క్యూబిక్ మీటర్లు, 40963 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంటుందని, స్వర్ణ ముఖి బ్యారేజి సమీపంలో గూడలి గ్రామం, కోట మండలం నందు 2.300 హెక్టార్ ల విస్తీర్ణంలో 35700 క్యూబిక్ మీటర్లు, 53550 మెట్రిక్ టన్నులు ఇసుక అందుబాటులోకి రానున్నదని తెలిపారు. డీ సిల్టేశన్ పాయింట్ వద్ద ఇసుక తోడడానికి, రవాణాకు ఏజెన్సీ ని అపాయింట్ చేయడానికి నిబంధనల మేరకు జలవనరుల శాఖ వారు తొందర్లో చర్యలు తీసుకోవాలని సూచించారు. డీ సిల్టేషన్ పాయింట్ నుండి ట్రాక్టర్లలో దగ్గరలో గుర్తించిన శాండ్ స్టాక్ యార్డ్ సేల్ పాయింట్ నందు డంప్ చేయాల్సి ఉంటుందని, అక్కడ నుండి వినియోగదారులు ఆన్లైన్ లో ఇసుక బుక్ చేసుకుని, అందులో సూచించిన సమయంలో అదే వాహనం తీసుకుని వచ్చి ఇసుక కమిటీ నిర్ధారించిన నామ మాత్రపు రుసుము మేరకు ఇసుక తీసుకు వెళ్లాల్సి ఉంటుందనీ తెలిపారు. స్టాక్ పాయింట్ నందు సీసీ కెమెరాలు ఏర్పాటు, 24ఇంటు7 పోలీస్ గస్తీ, పోలీస్ చెక్ పోస్ట్ పాయింట్ ఏర్పాటు, గ్రామ వార్డు సచివాలయం సిబ్బంది విధులు కేటాయించడం, అలాగే రెవెన్యూ శాఖ నుండి అధికారిని ఇంఛార్జి ఏర్పాటు, పర్యవేక్షణ ఉండాలని అన్నారు. కంప్యూటర్, ప్రింటర్ తదితర ఐటి, ఇతర సామాగ్రి ఏర్పాటు సేల్ పాయింట్ నందు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పట్టా భూమి లేదా డికేటి భూమి నందు ఇసుక ఉన్న వాటిని జిల్లా గనుల శాఖ అధికారి వారు నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సదరు భూములను రెవెన్యూ, గనుల శాఖ, కాలుష్య నియంత్రణ, జలవనరుల శాఖ, భూ గర్భ జలాల శాఖ, వ్యవసాయ శాఖ వారు సంయుక్తంగా తనిఖీ చేయాలని సూచించారు. ఇసుక రుసుము, ట్రాన్స్పోర్ట్ తదితర వాటి వివరాలు అన్ని సచివాలయాల్లో, తాసిల్దార్, ఎంపిడిఓ మరియు పోలీస్ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచుతామని తెలిపారు. రిజిస్టర్ చేసుకున్న వాహనం మాత్రమే తీసుకెళ్ళాల్సి ఉంటుందని తెలిపారు. ఇసుక అక్రమ రవాణా ను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని తప్పక చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే జిల్లాలో 8 ఓపెన్ శాండ్ రీచ్ లను అధికారులు జాయింట్ ఇన్స్పెక్షన్ చేస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, ఆర్డీఓ శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ఆర్డీఓ కిరణ్మయి, జిల్లా గనుల శాఖ అధికారి బాలాజీ నాయక్, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసరావు, జిల్లా ట్రాన్స్పోర్ట్ అధికారి మురళీమోహన్, జిల్లా పంచాయతీ అధికారిని సుశీల దేవి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ విజయ్ కుమార్, ఈ ఈ పిసిబి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# విడిది మండపాలకు మోక్షం కల్పించు ఈశ్వరా..

## - మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్ :** శ్రీకాళహస్తి కైలాసగిరి ప్రదక్షిణ మార్గంలో నిర్మాణం చేపట్టిన దేవుడు విడిది మండపాలను వెనువెంటనే పూర్తి చేయాలని శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణ కైలాసనాథుడు గిరిప్రదక్షిణకు వెళ్లే మార్గంలో 9 చోట్ల విడిది చేసి భక్తులు చే పూజలు అందుకుంటారు. కైలాసగిరి ప్రదక్షణ మార్గంలో స్వామివారిని కొలువు తీర్చడానికి పురాతన విడిది మండపాలు కనుమరుగు కావడంతో ఆయా విడిది మండపాలు వద్ద షామియాలను ఏర్పాటు చేసి స్వామి వారిని కొలువు తీర్చి పూజలు జరుపుతున్నారు. అయితే షామియానాలను చావులకు. కర్మ క్రియలకు ఇతర అశుభ కార్యాలకు వినియోగిస్తూ దేవుడు కార్యాలయం కూడా వినియోగించడంపై భక్తుల్లో పవిత్రత భావం దెబ్బతింటు. మానసిక వేదనకు గురయ్యే పరిస్థితి. ఈ పరిస్థితుల్లో గత ప్రభుత్వంలో అప్పటి ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు ధర్మకర్తల మండలి లో తీర్మానం చేసి కైలాసగిరి ప్రదక్షిణ మార్గంలోని తొమ్మిది చోట్ల విడిది మండపాలు నిర్మించాలని తీర్మానం చేశారు. నాడు విడిది మండపాల నిర్మాణం చేపట్టి మూడు చోట్ల పూర్తి చేయించి, గిరిప్రదక్షిణలో గతశివరాత్రి సమయంలో తొలి విడిది మండపంలో దేవుడు పూజలు అందుకునేలా చేశారు. మిగిలిన ఆరు చోట్ల విడిది మండపాలు అర్ధాంతరంగా నిర్మాణం పనులు ఆగిపోయి ఉన్నాయి. ప్రభుత్వం మారి ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించక ఎక్కడ పనులు అక్కడ ఆగిపోయాయి.. మళ్లీ సంక్రాంతికి కైలాసనాధుడు గిరిప్రదక్షిణ ఉండటం ఈ లోపల అర్ధాంతరంగా ఆగిపోయిన గిరిప్రదక్షిణ విడిది మండపాలను పూర్తిచేస్తే స్వామి వారు విడిది చేసి పూజలు అందుకునేందుకు ఎంతో సౌకర్యంగాను ఆధ్యాత్మిక చింతన



వెల్లి వెరుస్తుంది.. అయితే విడిది మండపాల నిర్మాణం కు ప్రస్తుతం దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులు చొరవచోపకపోవడంతో ఎక్కడికక్కడ విడిది మండపాల నిర్మాణాలు దెబ్బతినే పరిస్థితి నెలకొంది.. ఈ నేపథ్యంలో గురువారం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు టెంపుల్ అంజూరు తారక శ్రీనివాసులు విడిది మండపాలను సందర్శించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కైలాసనాద్రుడు కొలువుతీరే విడుదల మండపాలను వెంటనే పూర్తి చేసి రానున్న సంక్రాంతి మహాశివరాత్రి పర్వదినాల్లో గిరిప్రదక్షిణకి సిద్ధం చేయాలని కోరారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి చోరువ చూపి అర్ధాంతరంగా ఆగిపోయిన విడిది మండపాలను పూర్తి చేయించే విధంగా చొరవ చూపాలన్నారు. దేవస్థానం ఇంజనీరింగ్ శాఖ ప్రస్తుత ఈవో చంద్రశేఖర్ ఆజాద్ కైలాసగిరి ప్రదక్షిణ మార్గాన్ని పరిశీలించి దేవుడు కొలువుతీరే చోటా అపవిత్రమైన షామియానాలను వేసి దేవుడు కొలువ తీర్చాడు కంటే విడుదల మండపాలను పూర్తి చేసి అత్యంత భక్తి భావంతో స్వామివారిని కొలువు తీర్చడం బాధ్యతగా తీసుకొని పనులు పూర్తి చేయించేలా చొరవ చూపాలని కోరారు. కాంట్రాక్టర్లు పనులు నాణ్యతగా చేయకుంటే నాణ్యతగా చేసేలా చర్యలు తీసుకోవాలని దేవుడు కార్యం కోసం చేపట్టిన పనులను అర్ధాంతరంగా ఆపివేయడం తగదన్నారు. వెంటనే ఎమ్మెల్యే చొరవ చూపాలని కోరారు.

# ప్రాణాపాయ స్థితి నుండి యువతిని కాపాడిన పోలీసులు

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్ :** తన సోదరి ఆత్మహత్యాయత్నం చేసుకుంటుం ది అని చెన్నై నుండి తిరుపతి పోలీస్ కంట్రోల్ రూమ్‌కు వాట్సప్ ద్వారా వచ్చిన ఫిర్యాదు సకాలంలో పోలీసు బృందం స్పందించి సత్వర చర్యలు తీసుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. పోలీసు వారు తెలిపిన వివరాలు ప్రకారం గురువారం సాయంత్రం తిరుపతి పోలీస్ కంట్రోల్ రూమ్‌కి ఒక వాట్సప్ కాల్ వచ్చింది.. అటువైపు నుండి ఏడుస్తూ మా చెల్లెలు ఆత్మహత్య చేసుకుంటోందని, ఆమెను కాపాడండి అని కోరడంతో కంట్రోల్ రూమ్ పోలీసులు వెంటనే అప్రమత్తమై యువతి వివరాలను తెలుసుకొని, ఫోన్ నెంబర్ ఆధారంగా లొకేషన్ గుర్తించి, అలిపిరి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అలిపిరి సీఐ రామ్ కిషోర్ సత్వరమే స్పందించి తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని, అప్పటికే అపస్మారక స్థితిలో ఉన్న యువతిని ఆసుపత్రికి తరలించి తక్షణ వైద్య సదుపాయాన్ని అందించి ఆమె ప్రాణాలను కాపాడారు. ప్రస్తుతం ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతోందని పోలీసులు తెలిపారు. ఈ విషయమై జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు మాట్లాడుతూ ఆత్మహత్య మహా పాపం, మీకు ఏదైనా సమస్యలు ఉంటే, లేదా రాబోతుంది అన్న.. మీకు మీరే మదన పడకండి పోలీసులు ఎల్లవేళలా మీ రక్షణకు మీ సహాయార్థం ఏళ్ళ వేళలా అందుబాటులో ఉన్నారని, ఏ సమస్య అయినా వారికి తెలియపరచండి మీ సమస్యల్ని పరిష్కరిస్తారు. మీ వివరాలను కూడా గోప్యంగా ఉంచుతారు. గమనించండని యువతీ యువకులు మీ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, మీపై ఎన్నో ఆశలతో మీ తల్లిదండ్రులు వేచి ఉన్నారు. వారి ఆశలను మీ ఆశయాలను దూరం చేసుకోకండి అని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.



# అప్పు తీసుకుని ఇల్లు రాసిచ్చిన వ్యక్తి పరార్

### గ్రామ పెద్దల సమక్షంలో ఇల్లు స్వాధీనం



**చిట్టమూరు మేజర్‌న్యూస్:** తనకున్న ఇంటిని అమ్మేస్తానని నమ్మబలికి ఐదు లక్షల రూపాయలు తీసుకున్న వ్యక్తి ఏడాదికి పైగా కనబడకుండా పరారు కావడంతో అప్పిచ్చినవారు ఇంటిని స్వాధీనం చేసుకున్న సంఘటన చిట్టమూరు మండలం యాకశిరి పంచాయతీ గణ్ణంగిదిబ్బ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు, బాధితులు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పొట్ట చేత పట్టుకుని దుబాయ్ వెళ్లి జీవనం కొనసాగిస్తున్న గణ్ణంగిదిబ్బ గ్రామానికి చెందిన తోటకూర ప్రసాద్ అదే గ్రామానికి చెందిన సన్నారెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి కుమారుడు సన్నారెడ్డి రవీంద్ర రెడ్డికి రెండు దఫాలుగా ఐదు లక్షల రూపాయలు అప్పిచ్చాడు.మొదటి దఫాగా రెండు లక్షల రూపాయలు అప్పు తీసుకున్న రవీందర్ రెడ్డి సక్రమంగా చెల్లించకుండా ఇబ్బందులు పెడుతుండడంతో మరో మూడు లక్షల రూపాయలు ఇస్తే తన ఇంటిని అమ్మేస్తానని నమ్మబలికి సంవత్సరం గడువు తీసుకుని గ్రామ పెద్దల సమక్షంలో ఈ బాండ్ పేపర్ల పైన ప్రసాద్ కు అమ్మేస్తున్నట్లు పక్కాగా రాయించి అప్పజెప్పాడు.రవీందర్ రెడ్డి కి ఇచ్చిన గడువు ముగియడం, సమాధానం లేకపోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.వృత్తి రీత్యా దుబాయ్ లో ఉంటున్న ప్రసాద్ పలుమార్లు రవీంద్ర రెడ్డికి ఫోన్ చేసిన ప్రతిసారి సమాధానం లేకపోవడంతో గురువారం స్థానిక పెద్దల సమక్షంలో ప్రసాద్ తల్లి అంకమ్మ,బంధువులు పెళ్ళకూరయ్య,పలువురు ఇంటిని స్వాధీనం చేసుకున్నామని ప్రకటించారు.

# పేదలకు ఫల సరుకులు పంపిణీ



**గూడూరు, మేజర్‌న్యూస్ :** రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు ఫల సరుకులు పంపిణీ చేశారు. గురువారం గూడూరు సొసైటీ , మఠం వీధి లోని ఎఆర్ రోటరీ భవనంలో కార్యక్రమం నిర్వహించారు. దసరా పండుగ సందర్భంగా నందిమండలం వెంకట సుబ్బమ్మ జ్ఞాపకార్థం కుమారుడు రోటేరియన్ నందిమండలం బాల కృష్ణంరాజు దాతృత్వంతో నూతన వస్త్రాలను 26 మంది పేద వృద్ధులకు పంపిణీ చేశారు .ఈ కార్యక్రమంలో అధ్యక్షులు రోటేరియన్ శ్రీధర్ రెడ్డి, పాస్ట్ గవర్నర్ దశరథరామిరెడ్డి ప్రసంగిస్తూ పండుగ సందర్భంగా లబ్దిదారులకు నూతన వస్త్రాలను ఇవ్వడం చాలా మంచిదని బాలకృష్ణంరాజుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సభ్యులు పట్టణ ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఉపకార్యదర్శి బి రాంప్రసాద్, పాస్ట్ అసిస్టెంట్ గవర్నర్స్ రోటేరియన్ బి.దశరథరామిరెడ్డి, రోటేరియన్ మయూరి శ్యామ్ సుందర్ రావు,దాత రోటేరియన్ బాలకృష్ణంరాజు ,రోటేరియన్స్ కిరణ్ చక్రవర్తి,యం.సి.మల్లన్న రవికుమార్ పాల్గొన్నారు.

# దేశం గొప్ప మానవతావాదిని కోల్పోయింది



**గూడూరు, మేజర్‌న్యూస్ :** పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా మరణంతో దేశం గొప్ప మానవతావాదిని కోల్పోయిందని జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్ పేర్కొన్నారు. గురు వారం జనసేన పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా భారతీయ కీర్తిని ఇనుమడింపజేసిన ముద్దుబిడ్డను కోల్పోయామన్నారు. వ్యాపారంతోపాటు ఆధ్యాత్మిక, సామాజిక సేవల్లో తరించిన ధ్రువతార రాలిపోవడం దేశానికే తీరనిలోటన్నారు. టాటా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎనలేని సేవలు అందించారు. విద్య, వైద్య, గ్రామీణాభివృద్ధి రంగాలలో ట్రస్ట్ ద్వారా విశిష్ట సేవలు అందించారని పేర్కొన్నారు. రతన్ టాటా ఆత్మకు శాంతి చేకూరాలని కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని భగవంతున్ని ప్రార్థిస్తూ సంతాపం తెలియచేస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ గూడూరు నియోజవర్గం పీఓసి కె.మోహన్ మాట్లాడుతూ భారతదేశం ముద్దుబిడ్డ,మహోన్నతమైన వ్యక్తి రతన్ టాటా మృతికి సంతాపం తెలియజేస్తూ ఆయన చేసిన సేవలకు గాను కేంద్ర ప్రభుత్వం భారతదేశ అత్యున్నత పురస్కారం భారతరత్న అవార్డు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి నాగార్జున,సాయికిరణ్ చిల్లకూరు మండలం ప్రధాన కార్యదర్శి మనోజ్, జనసైనికులు మధుసూదన్, వెంకటేష్ సనత్ వసంత్ తదితరులు పాల్గొన్నారు.

# మంచినీటి ప్లాంట్ ఏర్పాటుకు భూమి పూజ



**పుంగనూరు, మేజర్‌న్యూస్:** మండల పరిసర ప్రాంతమైన మంగళం కాలనీ నందు గురువారం ఉచిత మంచినీటి ప్లాంట్ ఏర్పాటుకు భూమి పూజ చేశారు ఈ కార్యక్రమంలో టిడిపి పార్టీ మండల అధ్యక్షులు మాధవ్ రెడ్డి, జనసేన పార్టీమండలాధ్యక్షులు విరుపాక్షి నాయకులు సీవి రెడ్డి, జనసేన పోగ్రామ్స్ సెక్రటరీ చైతన్య రాయల్, రాఘవ, సుబ్రమణ్యం రాజు,హరీ నాయక్, మని, హరీ, రమణ, శ్రీను, చౌడప్పలు పాల్గొన్నారు.

# చిన్న మస్తా దేవి అలంకరణలో దుర్గాదేవి



**రామచంద్రపురం, మేజర్‌న్యూస్:** రాయలచెరువుకట్ట సమీపంలో వెలసియున్న శ్రీ శక్తి పీఠంలో గురువారం శ్రీ చిన్న మస్తా దేవి అలంకరణలో దుర్గామాత భక్తులకు దర్శనమిచ్చారు. కుర్తాళం పీఠాధిపతి సిద్దేశ్వర నంద మహా భారతి స్వామి పర్యవేక్షణలో పీఠాధిస్వరి రమ్యానంద భారతి అమ్మవారికి వివిధ రకాల సుగంధ భరిత పరిమళ ద్రవ్యాలతో అమ్మవారికి అభిషేకం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి నూతన పట్టు వస్త్రాలను సమర్పించారు. పలు రకాల పుష్పాలతో అమ్మవారిని శ్రీ చిన్న మస్తా దేవి గా తీర్చిదిద్దారు. అనంతరం అమ్మవారికి సంతాన లక్ష్మి, హెూమాలు, యజ్ఞాలు, సుహాసిని పూజ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ శక్తి పీఠం ఆలయాలు నిర్వాహకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

# రతన్ టాటా మరణం దేశానికీ తీరని లోటు

### - బిజెపి నేత కోలా ఆనంద్

**శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్ :** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యదర్శి అసెంబ్లీ పార్టీ కన్వీనర్ కోలా ఆనంద్ నేతృత్వంలో పద్మవిభూషణ్ అవార్డు అందుకున్న రతన్ టాటా కీ ఈ రోజు ఉదయం ఆయనకు ఘనంగా నివ్వాలర్పించారు. స్థానిక మద్రాసు పాత బస్టాండు కూడలిలో పట్టణ అధ్యక్షులు గరికపాటి రమేష్ బాబు ఏర్పాటు చేసిన రతన్ టాటా సంతాప సభలో కోలా ఆనంద్ మాట్లాడుతూ భారత




దేశంలో దిగ్గజ వ్యాపారవేత్త, ప్రముఖ పారిశ్రామికవేత్త, బిజినెస్ రతన్ టాటా మరణం యావత్ భారతదేశ ప్రజల్ని దిగ్భ్రాంతికి గురి చేసిందని కోలా ఆనంద్ వెల్లడించారు. రతన్ టాటా ప్రముఖ పారిశ్రామికవేత్త, గొప్ప మానవతావాది, వ్యాపార రంగంలో నిబద్ధతకు, విలువలకు కట్టుబడిన గొప్ప వ్యక్తిగానే కాకుండా దాతృత్వానికి ప్రతీక అన్నారు. టాటా చారిటబుల్ ట్రస్టు ద్వారా ఆయన ఎనలేని సేవలు అందించారని, విద్య, వైద్యం, ఐటి రంగం, గ్రామీణాభివృద్ధి రంగాల్లో ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. రతన్ టాటా ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తూ, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని కోలా ఆనంద్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యదర్శి, అసెంబ్లీ పార్టీ కన్వీనర్ కోలా ఆనంద్, జిల్లా కార్యదర్శి, అసెంబ్లీ పార్టీ కో - కన్వీనర్ మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, పట్టణ అధ్యక్షులు గరికపాటి రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి పుణ్యం డిల్లీ కుమార్ రెడ్డి, పెదపాలెం రవి అచ్చారి.్ణన పోలయ్య, పట్టణ యువమోర్చ అధ్యక్షులు తానికొండ్ల భరత్, సజ్జల హరీష్, సూర బిందు కుమార్, ధనుష్, కదూరు సమంత, చోటు, సిద్దు, నాని, గిరిధర్ సాయి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన విజయలక్ష్మి



**ఓజిలి, మేజర్ న్యూస్:** ఓజిలి నూతన ఎంపీడీవోగా సిహెచ్ విజయ లక్ష్మి గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎంపీడీవో రజనీకాంత్ బదిలీల్లో భాగంగా నెల్లూరు జిల్లా అల్లూరు మండలానికి బదిలీ అయ్యారు. చిట్టమూరు మండలంలో ఏవోగా గా విధులు నిర్వహిస్తున్న సిహెచ్ విజయలక్ష్మి బదిలీల్లో భాగంగా ఓజిలి మండలానికి ఇంచార్జ్ ఎంపీడీవోగా ఆమె బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు,అధికారులు సహకారంతో ఓజిలి మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలియజేశారు. అనంతరం ఇంచార్డి డి ఎల్ పి ఓ. రవిచంద్ర బాబు ను మర్యాదపూర్వం కలిశారు. ఆనంతరం సిబ్బంది ఎంపీడీవో విజయలక్ష్మికి ఘన స్వాగతం పలికి పూలమాలలు వేసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిస్టెంట్ రవి బాబు, జూనియర్ అసిస్టెంట్, దిలీప్ కుమార్, రవి,సిబ్బంది వినయ్ కుమార్, కార్యదర్శులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ మానసిక వికలాంగుల దినోత్సవం

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** ప్రపంచ మానసిక వికలాంగులు దినోత్సవం దినోత్సవం సందర్భంగా మండల లీగల్ సర్వీస్ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి ప్రభుత్వ ఆసుపత్రిలో మానసిక వికలాంగులకు పరిస్థితిని పరిశీలించారు, మానసిక వికలాంగులకు అందజేస్తున్న సదుపాయాలు వైద్యం గురించి ఏరియా ఆసుపత్రి సూపర్డెంట్ విజయలక్ష్మిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. మానసిక వికలాంగులు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల లీగల్ సర్వీస్ సభ్యులు మాట్లాడుతూ మానసిక వికలాంగులు ఆత్మ న్యూనతా భావాన్ని పక్కన పెట్టి ఆత్మస్థైర్యంతో ముందడుగు వేస్తే సాధించలేనిది ఏమీ లేదని తెలిపారు. అంగ వైకల్యంతో కుమిలిపోవాల్సిన అవసరం లేదని. ప్రభుత్వం మానసిక వికలాంగులకు అన్నిరకాలుగా ప్రోత్సహిస్తోందని స్పష్టం చేస్తున్నారు. ఎవరికైనా ఎటువంటి సమయంలోనైనా న్యాయ సలహాలు కావలసినవారు.15100 టోల్ ఫ్రీ నెంబర్ ఫోన్ చేస్తే వారికి ఉచిత న్యాయ సేవా సలహాలు అందుతాయని. శ్రీకాళహస్తి కోర్టు సముదాయంలో ఉచిత న్యాయ సలహాలు సేవలు ప్రత్యేక విభాగం ఉందని ప్రతి ఒక్కరు దీనిని వినియోగించుకోవాల్సిందిగా కోరారు. అదేవిధంగా మానసిక వికలాంగులకు ఉపయోగపడే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో న్యాయవాది రాజేశ్వరరావు రాజేష్ కృష్ణ, అరుణ్ దేవి, శ్రీకా ళహస్తి న్యాయస్థానం సిబ్బంది. శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.





# శ్రీ శీతలాంబ అమ్మవారి సేవలో బొజ్జల బృందమ్మ

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** పట్టణంలో వెలసియున్న శ్రీ శ్రీ శ్రీ శీతలంబ అమ్మవారిని తెలుగుదేశం పార్టీ మహిళా నాయకురాలు బొజ్జల బృందమ్మ గురువారం దర్శించుకున్నారు. భక్తులకు అన్నదానం కార్యక్రమం సమర్పించి శీతల మను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేడు ఎంపీ దగ్గుమల్ల ప్రసాదరావు పర్యటన..

ఎస్ఆర్ పురం, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని వివి పురం పంచాయతీ ఆరి మాకులపల్లి గ్రామంలోని గంగమ్మ గుడికి శుక్రవారం ఉదయం 10 గంటలకు చిత్తూరు ఎంపీ దగ్గుమల్ల ప్రసాదరావు పర్యటన ఉంటుందని మండల పార్టీ అధ్యక్షులు గంధంనేని జయశంకర్ నాయుడు ఒక ప్రకటన తెలిపారు. తయ్యారు పాయకట్టు నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా గ్రామంలో వెలసిన శ్రీ ఆరిమాను గంగమ్మ అమ్మవారికి సారేను సమర్పించను న్నారు. కావున ఎంపీ కార్యక్రమాన్ని మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు ,కూటమి నాయకులు, భారీ ఎత్తున విచ్చేసి జయప్రదం చేయవలసిందిగా కోరారు.

# నేను పేద వాడిని నా కడుపు కొట్టొద్దు

### - వెంకటరెడ్డి పాలెం ఫీల్డ్ అసిస్టెంట్ శివరాజ అధికారులకు మొర



ఓజిలి, మేజర్‌న్యూస్: నేను పేదవాడిని నా కడుపు కొట్టొద్దు అంటూ వెంకటరెడ్డి పాలెం ఫీల్డ్ అసిస్టెంట్ శివ రాజ జిల్లా అధికారులకు, మండల అధికారులను మొరపెట్టుకుంటున్నారు. ఈ సందర్భంగా శివరాజ గురువారం తన ఇంటి వద్ద మీడియాతో మాట్లాడుతూ రెండు సంవత్సరాల నుండి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లో ఫీల్డ్ అసిస్టెంట్‌గా బాధ్యతలు తీసుకొని పనిచేస్తూ జీవనం సాగిస్తున్నానని తెలియజేశారు. బీటెక్ వరకు చదువుకొని ఉద్యోగం రాక ఇంట్లో పూట గడవక పోవడంతో ఉపాధి హామీ లో ఫీల్డ్ అసిస్టెంట్‌గా చేరి క్రమశిక్షణతో పై అధికారుల ఆదేశాలు అనుసరిస్తూ మా వెంకటరెడ్డి పాలెం పంచాయతీలో నాకు కేటాయించిన ఉపాధి పనులను కూలీల చేత సక్రమంగా చేయిస్తున్నానని శివరాజ తెలియజేశారు. గత సంవత్సరం సామాజిక తనిఖీలో నా మీద ఎలాంటి రిమార్కులు రాలేదని ఫీల్డ్ అసిస్టెంట్ తెలియజేశారు. మా ఏపీవో వెంకటరెడ్డి పాలెం లో రాజకీయం నాయకుల మాటలు విని మీ ఊరి నాయకుడు చెప్పినట్టు విని పదిమందికి హాజరు వేయాలని ఆదేశించారు. నేను వారు చెప్పినట్టు పదిమందికి హాజరు వేయక పోవడంతో నన్ను ఫీల్డ్ అసిస్టెంట్ గా లేకుండా చేయాలని ఆలోచనతో తప్పుడు అర్జీని సృష్టించి నన్ను తొలగించాలని సస్పెండ్ నోటీస్ ఇవ్వడం జరిగిందన్నారు. అయితే నేను మాత్రం ఎలాంటి అవకతవకలకు పాల్పడలేదని శివ రాజ తెలియజేశాడు. సంబంధిత అధికారులు స్పందించి నాకు న్యాయం చేయాలని శివ రాజ మొరపెట్టుకుంటున్నారు.

## వాలీబాల్ కిట్లు పంపిణీ



**తొట్టంబేడు, మేజర్ న్యూస్:** ప్రముఖ సంఘ సేవకులు, జాతీయ వినియోగదారుల హక్కుల కమిషను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలవగుంట భరత్ రెడ్డి గురువారం మండలం పొయ్య యువతకు వాలీ బాల్ కిట్లు వితరణ చేశారు. ఈ సందర్భంగా కలవగుంట భరత్ రెడ్డి మాట్లాడుతూ. గ్రామీణ యువతకు క్రీడల పట్ల ఆసక్తి పెంచాలనే ఆశయంతో తాను ఈ కిట్లు అందచేశానన్నారు. తొట్టంబేడు మండల వ్యాప్తంగా యువతకు క్రీడా సామాగ్రి అందచేస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన చెప్పారు. గ్రామీణ యువత ఈ అవకాశం వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రయంలో కలవగుంట భరత్ రెడ్డి యువత పాల్గొన్నారు.



## దుర్గాదేవి అవతారంలో వైష్ణవీమాత

**చౌడేపల్లి, మేజర్‌న్యూస్:** మండలంలోని పుదిపట్లలో వెలసి ఉన్న వైష్ణవి మాత ఆలయంలో శరన్నవరాత్రులలో భాగంగా ఏడవరోజు దుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చిన వైష్ణవి మాత. ఏడవ రోజు అమ్మవారి సేవలో అశేషంగా భక్తులు పాల్గొన్నారు. భక్తులకు భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాత వినోద్ రెడ్డి పాల్గొన్నారు.

## దుర్గమ్మ అలంకరణలో ఏకవీర దేవి



**రామచంద్రపురం, మేజర్‌న్యూస్:** నవరాత్రులలో ఎనిమిదవ రోజు మహా పర్వతనమును పురస్కరించుకొని నేడు పూజ్య ప్రతాప్ స్వామీజీ దివ్య ఆశీస్సులతో ఏకవీర సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఈ రోజు ఆ ఏకవీర దేవి శ్రీ దుర్గా దేవి అలంకరణలో సురభి గో సంరక్షణ శాల చుట్టూ మూడు ప్రదక్షిణలతో దర్శనం ఇచ్చారు . తదుపరి భక్తులచే దర్బార్ సేవ, కుంకుమ అర్చనలు జరిగాయి. భక్తి పాటలు కచేరి జరిగింది చివరగా భక్తులకి తీర్థప్రసాదాలు అన్నదానం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏకవీర సేవ ఫౌండేషన్ కార్యనిర్వహకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రతన్ టాటాకు ఘన నివాళి



**పలమనేరు, మేజర్‌న్యూస్:** మన భారతదేశ ప్రజల ఆశా జ్యోతి, ప్రియతమ దిగ్గజ వ్యాపారవేత్త, పారిశ్రామికవేత్త, పద్మ భూషణ్, పద్మ విభూషణ్ కలిగిన వారు మన దేశ ముద్దు బిడ్డ వైకుంఠ ప్రాప్తి పొంది నారు. వారికిచిత్రపటానికి నివాళులర్పించారు. గురు వారం ఉదయం 11 గంటల కు బస్టాండ్ కూడాలి వద్దకు ప్రజలందరూ చేరుకున్నారు. అశ్రు నయనాలతో ఆణిముత్యం రతన్ టాటా అమర్ రహే భరతమాత ముద్దుబిడ్డ అమర్ రహే టాటా గ్రూప్ ముద్దుబిడ్డ అమర్ రహే భారతదేశ దిగ్గజ పారిశ్రామికవేత్త అమర్ రహే పద్మభూషణ్ రతన్ టాటా అమర్ రహే భరతమాత ముద్దుబిడ్డ అమరహేఅంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో దివ్య ధామం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు సిద్దయ్య, శివకుమార్, పుష్పాల వెంకటేశ్వర్లు, శ్రీపురం సీతారామయ్య, హేమంత్ కుమార్, రాజా, జయరాం, దొరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీవోగా అన్నపూర్ణ రావు



**వాకాడు, మేజర్‌న్యూస్:** వాకాడు ఎంపీడీవోగా అన్నపూర్ణ రావు గురువారం మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాకాడు మండలంలోని అభివృద్ధి, తాగు నీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి పెడతానన్నారు. అనంతరం మండల పరిషత్ ఏవో శ్రీనివాసులు, ఈఓపిఆర్‌డి ఉమా మహేశ్వర రావు, పిఆర్ఏఈ కిరణ్, కార్యదర్శిలు పలువురు నాయకులు ఆయనకు అభినందనలు తెలిపారు.

## దివ్యాంగురాలికి ట్రై సైకిల్

**గూడూరు రూరల్, మేజర్‌న్యూస్:** పట్టణంలోని 16వ వార్డు కర్ణాల వీధిలోని దివ్యాంగురాలు ఉదయగిరి గురు లీలకు ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ ట్రై సైకిల్ అందచేశారు.



గురువారం మధ్యాహ్నం పార్టీ కార్యాలయంలో గురులీలకు ట్రై సైకిల్ ను అందించిన అనంతరం ఎంఎల్ఏ మాట్లాడుతూ పేదల తన సహకారం ఎపుడూ ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు వాసిలి ప్రవీణ్ కుమార్, చైతన్య, బెజవాడ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రతన్ టాటా మృతి.. దేశానికి తీరని లోటు

**తిరుపతి ప్రెస్‌క్లబ్, మేజర్‌న్యూస్:** పారి శ్రామిక దిగ్గజం, దార్శ నిక సేవారత్నం, పేదవా ని కలల నిర్మాత అయిన టువంటి టాటా గ్రూప్ అధినేత రతన్ టాటా మృతి.. భారతదేశానికి తీరనిలోటని "రీచ్ గ్లోబల్ ఫౌండేషన్" చైర్మన్ డాక్టర్ రమేష్ నాథ్ లింగుట్ల అన్నారు. గురువారం స్థానిక ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో మొదటగా ఆయన రతన్ టాటా మృతి పట్ల సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉప్పు నుండి ఉక్కు వరకు,గుండు సూది నుండి విమానాల వరకు పారిశ్రామిక రంగంలో తనదైన శైలిలో 33 లక్షల కోట్ల డాలర్ల వరకు తన సంస్థ వ్యాపారాన్ని విస్తరింప చేసిన శ్రమజీవి రతన్ టాటా అని కొనియాడారు. జాగ్వార్,ల్యాండ్ రోవర్ కార్ల సంస్థ వెనుకబడిన సందర్భంలో ఇంగ్లాండ్ లోని ఫోర్డ్ సంస్థతో పొత్తు కుదుర్చుకుని ఆ సంస్థను లాభాల బాట పట్టించిన మహానుభావుడు అని, అలాగే అల్జీమర్స్,క్యాన్సర్ న్యూరో సైన్స్ లాంటి వైద్య సదుపాయాలలో తమ సంస్థ ద్వారా చేయూతనివ్వడం అదేవిధంగా కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో 1500 కోట్లు దేశానికి దాతృత్వంగా ఇవ్వడం,మరణం దగ్గరికి వచ్చిన నాకేమీ కాలేదు నేను క్షేమంగా ఉన్నానని చెప్పి మరణాన్ని ఎదిరించిన దిశాలి రతన్ టాటా అని కీర్తించారు. చరిత్రలో తనకంటూ ఒక పేజీ తనే లిఖించుకున్న



ధన్యజీవి అని యువతకు దేశభక్తులకు నిస్వార్థ త్యాగనిరతికి నిరుద్యోగులకు అందరికీ గొప్ప స్ఫూర్తిదాయక నాయకుడని రతన్ టాటా చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆయనకు భారత ప్రభుత్వం అత్యున్నత పురస్కారం "భారతరత్న" ఇవ్వాలని.. తమ ఫౌండేషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామని అన్నారు. దేశవ్యాప్తంగా వారం రోజులపాటు సంతాప దినాలుగా ప్రకటించాలని కోరారు. సమావేశంలో రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ ప్రతినిధులు డాక్టర్ మొర్రి మేకల దేవరాజులు,కలాం ట్రస్ట్ భాషా తదితరులు పాల్గొన్నారు.

## దురాదేవీ అలంకరణలో బోయకొండ గంగమ్మ దర్శనం

**చౌడేపల్లి, మేజర్‌న్యూస్:**



ప్రముఖ శక్తి క్షేత్రంగా విరాజిల్లుతున్న, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ బోయ కొండ గంగమ్మ దేవస్థానం నందు అత్యంత వైభవముగా జరుగుతున్న దసరా మహోత్సాల్లో భాగంగాగా ఏడవ రోజు అమ్మవారు శ్రీ దుర్గా దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చినారు. ధనలక్ష్మి, జిల్లా పంచాయతీ రాజ్ అధికా రిణి, శివ ప్రసాద్, మదనపల్లి వారు,విధ్యావతి, హనుమప్ప, ముళబాగాలు వారు, రత్నమ్మ, భాస్కరయ్య, పలమనేరు వారు,పార్వతి, ఆనంద, పుంగనూరు వారు,యశోదమ్మ,ప్రభాకర, కొలింపల్లి వారు, అనుప్రియ,శివ ముద్ర, చెన్నై వారు,రత్నమ్మ, వెంకట నారాయణ, మదాంవారిపల్లి వారు, ప్రియాంక, సుందర మూర్తి, బెంగ ళూరు వారు, వరలక్ష్మి,శ్రీనివాసులు, క్రిష్ణా జ్యువెల్లర్స్, పుంగనూరు వారు, సాయి లీలా, బాలాజి నాయక్, మదనపల్లి వారు, సుమల, మణికంఠ, శ్రీనివాస హాస్పిటల్, మదనపల్లి వారు, స్వప్న, రవికుమార్ రెడ్డి, బండెన్న పూల మొక్కల నర్సరి, అంగళ్ళు వారు,మమత, జి.ఆర్. యస్. రమణ, బోయకొండ వారు, ఉభయ దారులుగా పాల్గొన్నారు. ఉభయదారులతో గణపతి హోమము, చండీ హోమము నిర్వహించినారు. రామసముద్రం మండలం,నడింపల్లి గ్రామపంచాయతీ, కమతంపల్లికి చెందిన విజయ్‌కుమార్, చైతన్య వారు సుమారు లక్షాముప్పైవేల రూపాయల విలువ గల బంగారు చంద్ర హారం అమ్మవారికి విరాళంగా ఇచ్చినారు. ఈ కార్యక్రమములో దేవస్థాన ఉప కమిషనర్, కార్యనిర్వహణాధికారి జే.ఏకాంబరం, దేవస్థాన అర్చకులు, సిబ్బంది పాల్గొని వారికి తీర్థ ప్రసాదములు అందజేసి అమ్మవారి దర్శన భాగ్యము కల్పించారు.

## లోపించిన పారిశుద్ధ్యం

**చౌడేపల్లి, మేజర్‌న్యూస్:** మండలంలో గల చారాల గ్రామపంచాయతీ, ఓదుల పేటలో పారిశుద్ధ్యం లోపించినది. వీధులలో ఎటుచూసినా మురుగునీరు ప్రవహిస్తుంది. ఇలా మురునీరు ప్రవహించడం వలన ప్రజలు జ్వరాల భారిన పడుచున్నారు. ఎవ్వరు గాని ఈ సమస్యను పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోచున్నారు. ఎవరైనా రాజకీయ నాయకులు ఎన్నికల సమయం లో వస్తారు. మీకు ఇదిచేస్తాం, అది చేస్తాం అనిచెప్పి ఓట్లు వేయించుకుంటారు. తర్వాత ఎవరూ పట్టించు కోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం పైన అక్కడే గల పదవ వార్డుమెంబర్ ను వివరణ అడిగితే మా వీధిలోనే మురుగునీరు ఉంది నేనేమి చేయాలి అంటూ నవ్వుతూ సమాధానం ఇచ్చినది. గ్రామపంచాయతీ నిర్వహణ లో వార్డుమెంబర్లకు ఎటువంటి అవసరం లేకుండా చూస్తున్నట్లు తెలుస్తుంది. వెంటనే సంబదిత అధికారులు తగుచర్యలు తీసుకోవాలని గ్రామస్తులు తెలియజేస్తున్నారు.



### శ్రీ రాజరాజేశ్వరిగా
## దర్శనమిచ్చిన చౌడేశ్వరీ దేవి



**పుంగనూరు, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని చదల గ్రామంలో జరుగుతున్న దసరా బ్రహ్మోత్సవాలు అంబా శాంభవి చంద్రమౌళిర బలా పర్ణా ఉమా పార్వతీ కాళీ హైమవతీ శివా త్రినయనీ కాత్యాయనీ భైరవీ సావిత్రీ నవయౌవనా శుభకరీ సామ్రాజ్యలక్ష్మీప్రదా చిద్రూపీ పర దేవతా భగవతీ శ్రీరాజరాజేశ్వరీ ! శ్రీ సప్తమాతృక సమేత శ్రీ చౌడేశ్వరి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం అమ్మవారి మూల వి రాట్టును శ్రీ రాజరాజేశ్వరీ దేవి రూపంలో అలంకరించడానికి అర్చక స్వాములు చేసిన కృషి ఫలించింది. ఏ ఏ రూపమైతే చూసి తరించి తనువైతం చెందుతామో, ఏ దేవి దర్శనంతో మానవులకు ఆత్మవిశ్వాసం పెరుగుతుందో ఏ తల్లి దీవెనలు ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటాయో తండ్రి శ్రీ రాజ రాజేశ్వరి దేవి అవతారంలో శ్రీ చౌడేశ్వరి దేవి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో వేద పండితుల వేద పారాయణం, వైదికార్చన మూలవిరాట్యునకు పంచ మహా తీర్థాల నుంచి తెప్పించిన జలాలతో అభిషేకాదులు అనంతరం పంచ సుగంధ ద్రవ్య అభిషేకాలు తదనంతరం ఖర్జూలా సాల, హింతాలా ఫనస ద్రాక్షది వైకసవరణ ఫలాలతో అభిషేకం నిర్వహించారు ఈ సందర్భంగా అమ్మవారికి నిత్య హోమం ధన్వంతరి హోమం శ్రీ దుర్గా సూక్తం శ్రీ సూక్త హోమం నవదుర్గ హోమం శ్రీ చాముండేశ్వరి హోమం నిర్వహించారు ఆలయ వ్యవస్థాపకులు డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి ఉషశ్రీ దంపతులు వారి కుమారులు విజయాదిత్యా రెడ్డి విక్రమాదిత్య రెడ్డి మరియు వేణుగోపాల్ రెడ్డి కుటుంబ సభ్యులతో పూర్ణాహుతి మహా మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన వేలాదిమందిమంది భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు అన్న ప్రసాదం వితరణ చేశారు ఈరోజు కార్యక్రమంలో భాగంగా టీవీ ఆర్టిస్ట్ ప్రముఖ జానపద కళాకారుడు శ్రీ పల్సర్ రమణ వారి బృందం చే గొప్ప జానపద పాటలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఎన్విఆర్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి ఎన్ శివకుమార్ రెడ్డి ట్రస్ట్ సభ్యులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## విలువలతో కూడిన వ్యాపారం చేసిన రతన్ టాటా



**శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్:** భారత దేశ గొప్ప వ్యాపారవేత 21న వ్యాపారం చేసిన రతన్ టాటా మరణం భారతదేశానికి లోటని శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్ శివ నాయుడు తెలిపారు. అవసరమయితే నా దేశం కోసం నా యావదాస్తిని ఇచ్చేస్తాను అని చెప్పిన మహోన్నతమైన దేశభక్తి కలిగిన భారతదేశ పారిశ్రామిక వేత్త, దాత రతన్ నవల్ టాటా మరణం భారతదేశానికి తీరని లోటు. విలువలతో కూడిన వ్యాపారం చేసిన గొప్ప వ్యాపారవేత్త రతన్ టాటా మరణవార్త దిగ్భ్రాంతిని కలిగించింది. శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యులు ఎస్సీవి నాయుడు ఒక ప్రకటనలో కోరారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ఆ దేవుడుని ప్రార్థిస్తూ ఆయనకు శ్రద్ధాంజలి ఘటిస్తున్నాను అని తెలిపారు.

# శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో అలరించిన కోలాటం





**తిరుమల, మేజర్‌న్యూస్:** శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఏడో రోజైన గురువారం మలయప్ప స్వామి చంద్రప్రభ వాహనంపై దర్బార్ కృష్ణుని అలంకారంలో మాడా వీధుల్లో విహరించారు. వాహనం ముందు నిర్వహించిన భజన కోలాటం భక్తులను అలరించింది. హైదరాబాద్‌కు చెందిన శ్రీకృష్ణ కోలాటం భజనమండలి వారి ఆధ్వర్యంలో దాదాపు 28మంది కళాకారులు కోలాటం నిర్వహించారు. స్వామివారి సంగీత పాటలతో వారు కోలాటం ఆడడం భక్తులను అలరించింది. ఈ కోలాటం నిర్వహించిన వారిలో రాజేశ్వరి, సునీత, సుకన్య, శిరీష, కవిత, లక్ష్మి, శ్రీలత, పద్మావతి, విజయలక్ష్మి, శ్రీవల్లి, మహేశ్వరి, జ్యోతి, దుర్గా లక్ష్మి, దీప్తి, హైమా, శ్రీ వల్లెమ్మ, పద్మ, ఉష, మాధవి, శోభ, జోయ, ఉమా, శ్రీదేవి, ఎన్.శిరీష, విజయలు పాల్గొన్నారు.





# ప్రజాభిమానం చూరగొన్న నాయకుడు వేణుగోపాల్ రెడ్డి

## టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్

**పుంగనూరు, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని చదల గ్రామంలో చౌడేశ్వరి అమ్మవారి దసరా ఉత్సవాలలో పాల్గొన్న టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్‌కు ఆలయధర్మకర్త వేణుగోపాల్ రెడ్డిఅర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనభాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. విలేకరుల సమావేశంలో టిడ్కో చైర్మన్ మాట్లాడుతూ ప్రజాభిమానం చూరగొన్న నాయకుడు వేణుగోపాల్ రెడ్డి అన్నారు రాబోయే రోజుల్లో మంచి పరిణామాలు జరుగుతాయి నేను టిడ్కో చైర్మన్‌గా పిఠాపురం, నెల్లూరు జిల్లాలోని టిడ్కో ఇళ్లను పరిశీలించాను. అక్కడున్న వారు భద్రత లేదని, వీధిలైట్లు లేవని, ఇల్లు రెడీ అయినాతమ ఇంతవరకు అప్ప చెప్పలేదని తెలిపారు. ఈ సమస్యలను ఒక నెల 15 రోజుల్లోపే మంత్రి నారాయణస్వామి చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని కాపాడడం మనందరి బాధ్యత అన్నారు. ఎన్వీఆర్ ట్రస్ట్ అధ్యక్షులు వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్ కొత్తతరం రాజకీయాలకు తెరతీసారని గత పది సంవత్సరాల నుండి రాజకీయాలు చూస్తున్నాం ఏ పత్రికలు చూసినా మీరు ఇంత దోచేశారనేది నడుస్తున్నది. మనందరం ఎవరో దోచేస్తున్న మనం బాధపడి వదిలేస్తున్నాం. డబ్బులేని రాజకీయం మనం చూడాలి చూపించాలి. యువత కచ్చితంగా సహకరించండి కొత్తతరం రాజకీయాల కోసం తెరతీద్దాం మన పిల్లలకు మంచి భవిష్యత్తు ఇద్దామన్నారు.



# భక్తులను మైమరపించిన బిహు, గురియో, దాండియా నృత్యాలు

**తిరుమల, మేజర్‌న్యూస్:** తిరుమలలో శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్స వాలలో భాగంగా 7వ రోజు గురువారం ఉదయం సూర్యప్రభ వాహన సేవలో సాంస్కృతిక వైవిధ్యం కనిపించేలా వివిధ రాష్ట్రాల కళాకారులు తమ సంప్రదాయ కళలను చక్కగా ప్రదర్శించారు. టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టు ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాల నుండి 16 బృందాలు, 405మంది కళాకారులు పాల్గొని తమ కళానైపుణ్యం ప్రదర్శించారు.ఇందులో అస్సాం రాష్ట్రానికి చెందిన జోయ బృందం ప్రదర్శించిన బిహు నృత్యం, పంజాబ్‌కు చెందిన రాహుల్ హెగడే బృందం ప్రదర్శించిన గురియో నృత్యం, విశాఖపట్నంకు చెందిన బి.విజయ బృందం ప్రదర్శించిన దాండియా నృత్యం మైమరపింప చేసింది. తిరుపతి శ్రీవేంకటేశ్వర సంగీత నృత్య కళాశాల విద్యార్థులచే భరతనాట్యం, కూచిపూడి నృత్యాలు, బెంగళూరుకు చెందిన గౌరీ బృందం ప్రదర్శించిన శ్రీరామ విజయం, రూపశ్రీ బృందం ప్రదర్శించిన ఆదిత్య నమనం, అనకాపల్లికి చెందిన ధనలక్ష్మి బృందం ప్రదర్శించిన శింబు నృత్యం, రాజమండ్రికి చెందిన నాగలక్ష్మి బృందం ప్రదర్శించిన డప్పువాయిద్యాలు ఆకట్టుకున్నాయి. విజయవాడ, విశాఖపట్నం, శ్రీకాకుళంకు చెందిన కోలాటం బృందాలు ప్రదర్శించిన కోలాటాలు భక్తులను భక్తి పారవశ్యంతో ముంచాయి.





# చంద్రప్రభ వాహనంపై దర్బార్ కృష్ణుడు

**తిరుమల, మేజర్‌న్యూస్:** తిరుమల శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలలో 7వ రోజైన గురువారం సాయంత్రం శ్రీ మలయప్ప స్వామి చంద్రప్రభ వాహనంపై దర్బార్ కృష్ణుని అలంకారంలో తిరుమల నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులను అనుగ్రహించారు. "పురుషోత్తమ ప్రాప్తియాగం" చంద్రుడిని శ్రీ మహా విష్ణువు రూపుగా వర్ణిస్తుంది. ఖగోళ శాస్త్రం చంద్రుని సమస్త జీవకోటికి సస్యకారునిగా పేర్కొంది. సాక్షాత్తు శ్రీకృష్ణ పరమాత్ముడు తనను తాను నక్షత్ర కూటమిలో చంద్రునిగా అభివర్ణిస్తాడు. అందుకే అంకురార్పణం కూడా సాయంత్రం వేళ చంద్రకాంతిలోనే జరుగుతుంది. చంద్రప్రభ వాహనంపై స్వామివారి దర్శనం మంచికి, ప్రశాంతతకు, ఆనందానికి సంకేతంగా భక్తులు భావిస్తారు. ఈ వాహన సేవలో తిరుమల పెద్ద జియ్యం, తిరుమల చిన్నజియ్యం స్వామి, టీటీడీ ఈఓ శ్యామలరావు, అదనపు ఈఓ వెంకయ్య చౌదరి, జేఈఓలు గౌతమి, వీరబ్రహ్మం, సివిఎస్ఓ శ్రీధర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.










## విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్యలో తిరుపతి జిల్లాలోని
కింది మండలాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన,
యువకులు విలేకరులుగా కావలెను.

**వెంకటగిరి నియోజకవర్గం :**

1. బాలాయపల్లి

**సత్యవేడు నియోజకవర్గం :**

1.సత్యవేడు, 2. బి.ఎన్.కండ్రిగ, 3. నాగలాపురం,
4. పిచ్చాటూరు, 5. నారాయణవనం

**చంద్రగిరి నియోజకవర్గం :**

1.పాకాల, 2.చిన్న గొట్టికల్లు, 3.ఎర్రవారి పాలెం

కె.సురేష్‌బాబు (బ్రాంచ్ మేనేజర్) ఫోన్ నెంబర్: 9346318232

ఎన్.లక్ష్మినారాయణ (రీజనల్ మేనేజర్) ఫోన్ నెంబర్: 6301107116

## నూతన ఎంపీడీని కలిసిన తేదేపా మండల నాయకులు



**ఓజిలి, మేజర్ న్యూస్:** మండలం నూతన ఎంపీడీవోగా సిహెచ్. విజయలక్ష్మి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆమెను ఇంచార్జ్ డిఎల్‌పిఓ రవిచంద్రబాబును తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు గుజ్జులపూడి విజయ్ కుమార్ నాయుడు గురువారం ఓజిలి మండల ఉపాధ్యక్షులు దువ్వూరు శ్రీనివాసులు రెడ్డి, తిరుపతి పార్లమెంట్ బీసీ సెల్ కార్యవర్గ సభ్యులు పాడి వెంకటసుబ్బయ్య యాదవ్, ఓజిలి మండలం ముస్లిం మైనార్టీ అధ్యక్షులు షేక్ .అల్లాబక్షు , తెలుగుదేశం పార్టీనాయకులు అట్ల .మల్లికార్జున్ యాదవ్ , తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి గురువారం ఎంపీడీవో కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శాలువతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కార్యాలయానికి వచ్చే మండలప్రజలకు అందుబాటులో ఉంటూ పేద ప్రజలకు సేవలందిస్తానన్నారు.

## పల్లె పండుగను విజయవంతం చేద్దాం



**వాకాడు, మేజర్ న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న పల్లె పండుగ కార్యక్రమంను విజయవంతం చేయాలని అన్నపూర్ణ రావు సిబ్బందికి సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీడీవో అన్నపూర్ణ రావు పంచాయతీ కార్యదర్శులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 14 నుండి 20వ తేదీ వరకు పల్లె పండుగ కార్యక్రమం జరుగుతుందని 18 వ తేదీ గూడూరు శాసనసభ్యులు డాక్టర్ పాసిం సునీల్ కుమార్ పల్లె పండుగ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

## లలితా దేవి అలంకారంలో దర్శనమిచ్చిన ఆరిమాని గంగమ్మ తల్లి



**ఎస్ఆర్ పురం, మేజర్‌న్యూస్:** మండలయిఎ తయ్యూరు పాయకట్టు ఇలవేల్పు గంగమ్మ తల్లి దసరా ఉత్సవాల్లో 8 వ రోజు సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు వెంకటపతి ఆచార్యులు, రాజేంద్ర స్వామి ఆధ్వర్యంలో లలితా దేవి కుంకుమార్చన మహాభిషేకం లలితా దేవి హెూమం కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులు కు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆరిమాని గంగమ్మ తల్లి లలితాదేవి అలంకారంలో గ్రామ పురవీధుల్లో అమ్మవారు ఊరేగారు. ఉభయ దారులుగా నల్లాపల్లి, చిన్నబాపన పల్లి గ్రామస్తులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ లింగారెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు తయ్యూరు పాయకట్టు ప్రజలు పాల్గొన్నారు.

## గ్రంధం ప్రచురణకు విరాళం



శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్: శ్రీకాళహస్తి ఎల్ ఐ సి ఏజెంట్ ప్రముఖ పాత్రికేయుడు పెరిపైడి దొరస్వామిచే ప్రచరించనున్న శ్రీ జ్ఞానాంమృతం గ్రంథంనకు గురువారం డిగ్రీ పూర్వ విద్యార్థులు విరాళంగా 54 వేలు రూపాయలు అందించారు. సమస్త పురాణాలు సారాంశం అయిన జీవాత్మ, పరమాత్మ ఒక్కటే అనే తత్వాన్ని ఈ గ్రంథం తెలియజేస్తున్నదని దొరస్వామి తెలిపారు. ఇప్పటి వరకు ఆధ్యాత్మికంగా నాలుగు గ్రంథాలను ప్రచురించానన్ని వివరించారు. ఈ జ్ఞానాంమృతం గ్రంథంలో శ్రీ దేవి భాగవతం, సౌందర్య లహరి, శ్రీ లలితా సహ్రనామ స్తోత్రం, కనకధారా స్తవం లాంటి గ్రంథాల రహస్యాలను సాధారణ శైలిలో రచించడం జరిగింద న్నారు. ఈ గ్రంథం కార్తీక మాసం, నవంబర్ నెల 24వ తేదీన కాంచీపురం కామాక్షమ్మ ఆలయం నందు ఆవిష్కరణ చేయనున్నట్లు గ్రంథకర్త పి.దొరస్వామి తెలిపారు.

## ఘనంగా శ్రీ ఇరగాలమ్మ తల్లి నవరాత్రి ఉత్సవాలు

**ఎస్ఆర్ పురం, మేజర్‌న్యూస్:** ఎస్ఆర్ పురం మండలం పిల్లారి కుప్పం పంచాయతీ మూలూరు గ్రామంలో వెలసిన శ్రీ ఇరగలమ్మ తల్లి నవరాత్రి ఉత్సవాలు ఎనిమిదవ రోజు ఘనంగా నిర్వహించారు గురువారం దుర్గాష్టమి సందర్భంగా ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించామని ఆలయ చైర్మన్ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు అలాగే ప్రత్యేక హెూమం నిర్వహించి రాత్రి శ్రీ ఇరగాలమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.. అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు.



## అజ్ఞానం నుంచి జ్ఞానం వైపు మనిషి ప్రయాణం సాగాలి

**-ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రజలను ఏ వైపు నడుపుతున్నారో ఆలోచించాలి**

**-తరిమెల నాగిరెడ్డి విజ్ఞాన కేంద్రం ప్రధాన కార్యదర్శి రాయపనేని హరికృష్ణ**




తిరుపతి ప్రెస్‌క్లబ్, మేజర్‌న్యూస్: మనిషిని అజ్ఞానం నుంచి జ్ఞానం వైపు నడిపేది సైన్స్ అని సనాతన ధర్మం అజ్ఞానం వైపు,అంధకారం వైపు మనిషిని తీసుకు వెళుతుందని తరిమెల నాగిరెడ్డి విజ్ఞాన కేంద్రం ప్రధాన కార్యదర్శి రాయపనేని హరికృష్ణ చెప్పారు. గురువారం తిరుపతి "యూత్ హాస్టల్"నందు తరిమెల నాగిరెడ్డి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో కోశాధికారి పి.వెంకటరత్నం అధ్యక్షతన సనాతన ధర్మం–రాజకీయాలు అనే అంశంపై చర్చ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రాయపనేని హరికృష్ణ మాట్లాడుతూ చరిత్రను పరిశీలిస్తే ఆయా కాలాలను బట్టి అప్పటి ధర్మాలు వర్తించాయని చెప్పారు. సనాతన ధర్మం మనుధర్మ సూత్రాలకు అనుగుణంగా రూపొందించబడిందన్నారు. బాల్య వివాహాలు, సతీసహగమనంను ప్రోత్సాహిస్తూ, వితంతు వివాహాలు జరపడం,మహిళలు సభ్య సమాజంలోకి తలెత్తుకు రావడం, చదువుకోవడం కూడా ఆనాడు నేరాలుగా భావించేవారన్నారు. ప్రస్తుత సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో పురోగమిస్తున్నారని దీనిని ఆపాలన్నదే ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లక్ష్యమా అని ప్రశ్నించారు. సనాతన ధర్మానికి తాను ప్రతీక అన్నట్లుగా తిరుపతి వారాహి సభలో ఆయన చేసిన ప్రసంగం అర్థరహితమన్నారు. ఉపముఖ్యమంత్రిగా ఆయన సమాజంలో ఉద్రిక్తతలు సృష్టించేలా మాట్లాడరని ఇది సరికాదన్నారు. మతాలతో రాజకీయాలను నడపడం క్షమించరాని నేరమన్నారు. సీనియర్ జర్నలిస్ట్ రాఘవ శర్మ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ బిజెపి ప్రతినిధిగా మాట్లాడారని అన్నారు. తాను వెంటనే ఆంధ్ర రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాలని భావిస్తున్నట్లు, అందుకు బిజెపి అండతో ఇప్పటి నుంచే రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు కనిపిస్తోందన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పాటూరి వెంకటరత్నం మాట్లాడుతూ సనాతన ధర్మం నేటి ఆధునిక యుగాన్ని మధ్యయుగాల వైపు నడిపిస్తుందని, ఇది ఏ మాత్రం సరికాదన్నారు.మున్సిపల్ ఉద్యోగ సంఘం నాయకులు తులసేంద్ర మాట్లాడుతూ దేశంలో బిజెపి అనుసరిస్తున్న మతోన్మాద చర్యలు ఉద్రిక్తతలకు దారి తీస్తున్నాయని చెప్పారు. ప్రజా వేదిక ప్రధాన కార్యదర్శి కే కుమార్ రెడ్డి మాట్లాడుతూ అన్ని మతాల దారి అజ్ఞానం, అంధకారం వైపేనని చెప్పారు. మార్పు సహజమన్నారు. నేటి పరిస్థితుల్లో పెట్టుబడిదారుల దోపిడీ సాగాలంటే వారికి కర్మ సిద్ధాంతం బోధించే మతం ఉండాలని అందుకోసమే పవన్ కళ్యాణ్ తిరుపతి వారాహి సభలో సనాతన ధర్మం వైపు మొగ్గు చూపారని అన్నారు. అవధూత సింహ శ్రీ విద్యాహంస భారతి అనుచరులు ఆల్ మెన్ రాజు సూద్ర మాట్లాడుతూ ధర్మం ఒక్కటే శాశ్వతమైనదని అన్నారు. నేడు అన్ని అంశాలు ముఖ్యంగా రాజకీయాలతో సహా అన్నీ కలుషితమైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. యుటిఎఫ్ నాయకురాలు నిర్మల మాట్లాడుతూ మనుధర్మాన్ని ఆమోదించడమంటే నేటి ఆధునిక మహిళల ప్రాణాలను బలి తీసుకోవడమే అన్నారు. మహిళలను వంటింటి కుందేలుగా చేసి తమ ఆధిపత్యం చెలాయించడానికి కొందరు ప్రయత్నిస్తున్నారన్నారు. ఇది దేశాభివృద్ధికి గొడ్డలి పెట్టి అవుతుందన్నారు. ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సనాతన ధర్మం గురించి తెలుసుకుని మాట్లాడి ఉంటే బాగుండేదని అన్నారు. తాను సనాతన ధర్మాన్ని బ్రతికించడానికి వచ్చినట్లుగా ఆయన ప్రకటించుకోవడం ఆయన అవివేకాన్ని బయటపెడుతోందన్నారు. తరిమెల నాగిరెడ్డి విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు రామిశెట్టి వెంకయ్య మాట్లాడుతూ సమాజాన్ని ప్రగతి పదం వైపు నడిపించడానికి, దోపిడీ వ్యవస్థను నిర్మూలించి పేదల అభ్యున్నతికి తరిమెల నాగిరెడ్డి పాటుపడ్డారని చెప్పారు. ఆయన స్ఫూర్తితో ఈ విజ్ఞాన కేంద్రం భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలను చేపడుతుందని ప్రకటించారు. ఇందుకు అందరి సహాయ సహకారాలు అవసరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగి జయరామయ్య, మహిళా సంఘం నాయకురాలు ఉష,ఆశ యూనియన్ నాయకురాలు రాణి, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకుడు ముని కుమార్,హరీష్, పిడిఎస్యు నాయకుడు ధన శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## దాడి చేశారు-హత్యాయత్నం కేసు బనాయించారు

**- పోలీసుల తీరుపై దళిత సంఘాల ఆగ్రహం**



**వి.కోట, మేజర్ న్యూస్:** మండలం మిట్టూరు గ్రామంలో దళిత కుటుంబంపై అగ్రవర్ణాలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లో వెళితే...దళిత కుటుంబానికి చెందిన గోపాలప్ప వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పిల్లల్ని విద్యావంతుల్ని చేశాడు. ఆ గ్రామంలో అగ్ర వర్ణాలు దళితుల పట్ల చిన్నచూపు చూస్తారు. ఈ గ్రామంలో మూడు కుటుంబాలు ఆత్మగౌరవంతో బతికే వాళ్ళు. అందులో గోపాలప్ప కుటుంబం ఒకటి. అగ్రవర్ణాల ఆంక్షలు ఒప్పుకునే వాళ్ళు కాదు. దీంతో వారిపై ఇదే గ్రామానికి చెందిన వెంకట్రామప్ప అనే అబ్బోడు కక్ష పెంచుకున్నాడు. గతంలో గోపాలప్ప కుమారుడు వెంకటేష్ పై అబ్బోడు కుమారుడు ద్విచక్ర వాహనంతో గుద్ది చంపేందుకు యత్నంచాడు. కులం పేరుతో దూషించాడు. ఈ విషయమై 2020లో వి.కోట పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. గ్రామస్తులందరూ అబ్బోడు కుటుంబ వగైరాలాది తప్పని పోలీసులకు విన్నవించారు. అనంతరం నెర్నిపల్లి గ్రామపంచాయతీకి తెదేపా పార్టీ కన్వీనర్‌గా ఎంపిక కాబడ్డాడు. అప్పటినుంచి వీరిపై మరింత కక్ష పెంచుకున్నాడు. పార్టీ అధికారంలోకి వచ్చింది. గోపాలప్ప కుటుంబ వగైరాల కథ తేల్చాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం సుమారు 7 గంటలకు గోపాలప్ప కుమారుడు వెంకటేష్ తన ఇంటి ఆవరణలో పళ్ళు తోముతూ నిల్చున్నాడు. ఇదే అదనుగా అటువైపు వీధిలో వెళుతున్న వెంకటరామప్ప అనే అబ్బోడు నేను దారిలో వెళ్తున్నప్పుడే నీ ఇంటి వద్ద ఎందుకు ఉమ్మి వేశావు అంటూ ఆకారణంగా అప్పటికే పక్క ప్రణాళికతో తన చేతిలో ఉంచుకున్న కర్రతో దళిత కుటుంబం ఇంటి ప్రాంగణంలోకి చొరబడి దాడి చేశాడు. వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేసి 5 మంది కలిసి మూకుమ్మడి దాడి చేసి చంపేందుకు ప్రయత్నించారు. కులం పేరుతో దూషించారు. వెంకటేష్ తలపై కర్రతో కొట్టారు. రాళ్లు,ఇటుకలతో విరుచుకుపడ్డారు. తీవ్ర రక్త గాయమయ్యింది. దళిత మహిళపై అసభ్యంగా ప్రవర్తించారు. గోపాలప్ప చెయ్యి విరిగింది. ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని భయంతో దాకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని బాధితులు వాపోయారు. అరగంట ఆలస్యమై ఉంటే ప్రాణాలు తీసేవారని ఆవేదన వ్యక్తం చేశారు. తీవ్ర గాయాలపాలైన దళిత కుటుంబాన్ని గ్రామస్తులు వి.కోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స తీసుకున్నారు. మెరుగైన వైద్యం కోసం వైద్యులు పి.ఈ.ఎస్ ఆసుపత్రికి రేఫర్ చేశారు. గోపాలప్ప చికిత్స తీసుకుంటున్నాడు.



అకారణంగా తమ ఇంటి వద్ద ఉన్న తమపై వెంకట్రామప్ప అనే అబ్బోడు వగైరాలు దాడి చేసి చంపేందుకు ప్రయత్నించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం నిందితుడు ఎలాగైనా అవకాశం దొరికింది. వీళ్ళ అంతుచూడాలని కుట్రకు తెరలేపాడు. అధికార పార్టీ నాయకులకు సమాచారం చేరవేశాడు. ఆగమేఘాలపై అధికార పార్టీ నాయకులు పోలీసులపై తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చారు. దళితుల ఇంటి ప్రాంగణంలోకి చొరబడి దళితులపైనే దాడి చేసి చంపేందుకు ప్రయత్నించిన నిందితుల ఫిర్యాదుకు దళిత కుటుంబం పై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. దళితుల ఫిర్యాదుపై నామమాత్రపు కేసుతో చేతులు దులుపుకున్నారు. కూటమి పాలనలో దళితులపై దాడులు, దౌర్జన్యాలు ఎక్కువయ్యాయని వారు వాపోయారు. దళితులపై దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసు ఎందుకు నమోదు చేయలేదని దళిత సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. పోలీసుల సైతం అధికార పార్టీ నాయకులకు వంతుపాడడం తగదని నిలదీస్తున్నారు. దళితులు తమ ఇంటి వద్దే రక్షణ లేని దుస్థితిని ఎదుర్కొంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దెబ్బలు తిన్న దళితులపైనే జైలుకు పంపే సెక్షన్లు నమోదు చేసి... నిందితులపై నామమాత్రపు కేసులు పెట్టడం...పోలీసులు అధికార పార్టీకి వంతు పాడడం..దళితులకు తీవ్ర ద్రోహం చేయడమేనని దళిత సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. దళిత కుటుంబానికి న్యాయం చేయకపోతే దళిత సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని వారు హెచ్చరించారు. దళితులపై నమోదు చేసిన అక్రమ హత్యాయత్నం కేసును ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## నంబర్ ప్లేట్ లేని వాహనాలు నడిపిన వారిపై కఠిన చర్యలు

**- రాళ్లబుదుగురు ఎస్సై నరేష్**



**శాంతిపురం మేజర్ న్యూస్ :** శాంతిపురం మండలం రాళ్ళబుదుగురు పోలీసు వారు తెలియజేయడం ఏమనగా మన శాంతిపురం మండలం కర్ణాటక మరియు తమిళనాడు రాష్ట్రాల సరిహద్దులో ఉన్నందువలన కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి సమయాల్లో మరియు పగటి సమయాలలో నెంబర్ ప్లేట్ లేని వాహనాలను తీసుకుని వచ్చి, శాంతిపురం చుట్టుపక్కల ప్రాంతాల నందు దొంగతనాలు చేయుటకు ప్రయత్నిస్తున్నారు. సదరు విషయముగా పోలీస్ ఉన్నతాధికారుల సూచనల మేరకు రేపటి నుండి అనగా 11.10.2024 తేదీ నుండి శాంతిపురం మండలం నందు నెంబర్ ప్లేట్ లేని వాహనాలు నడుపుతున్న వారిపైన ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, సదరు వాహనాలను సీజ్ చేయబడుతుందని రాళ్ళబుదుగురు ఎస్సై నరేష్ తెలిపారు . కావున శాంతిపురం మండల ప్రజలందరూ మీకు చెందిన వాహనాల యొక్క రికార్డులు సక్రమంగా ఉంచుకొని, హెల్మెట్ ధరించి, మీ యొక్క వాహనాలకు నెంబర్ ప్లేట్లు సక్రమంగా అమర్చుకొని రోడ్డు భద్రతా నియమాలు పాటించి, మీ యొక్క వాహనాలను నడుపు కోవాలని తెలిపారు . అలా చేయని వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు .

## వ్యాపార దిగ్గజం రతన్ టాటాకు శ్రీసిటీ ఎండీ ఘన నివాళి

**తడ మేజర్ న్యూస్ :** గొప్ప దార్శినికతకు, భారతీయ పరిశ్రమకు, దాతృత్వానికి మారుపేరైన టాటా సన్స్ గ్రూప్ మాజీ చైర్మన్ రతన్ నావల్ టాటా మృతి పట్ల శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆ మహోన్నత వ్యక్తికి ఘనంగా నివాళులు అర్పిస్తూ, తరతరాలకు స్ఫూర్తినిచ్చే దార్శనికుడిని భారతదేశం కోల్పోయిందని పేర్కొన్నారు. 2019, ఏప్రిల్ 16 న రతన్ టాటా శ్రీసిటీ సందర్శించినను గుర్తుచేసుకున్న రవీంద్ర సన్నారెడ్డి, నాటి పర్యటనలో "అంకితభావం, చిత్తశుద్ధితో ఏమి సాధించవచ్చో చెప్పడానికి శ్రీసిటీ సరైన ఉదాహరణ" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు తమకెంతో గౌరవప్రదమని అన్నారు. దేశ నిర్మాణం, వ్యాపార నైతికత, దాతృత్వం మొదలైన అంశాలలో రతన్ టాటా చేసిన అసమానమైన కృషి సమాజానికి స్ఫూర్తినిస్తుంది. ఆయన విలక్షణ నాయకత్వం వ్యాపార రంగంలోని వారికి మార్గ దర్శనం చేస్తుందని ఆయన చెప్పారు. దేశంలో రెడీ-టు-ఈట్ మార్కెట్‌లో రెండవ అతిపెద్ద సంస్థగా పేరున్న టాటా స్మార్ట్‌ఫుడ్జ్ లిమిటెడ్ పరిశ్రమ స్థాపించడానికి శ్రీసిటీని ఎన్నుకున్నారని, అలాగే శ్రీసిటీలోని క్రియా విశ్వవిద్యాలయం పాలక మండలికి సలహాదారుగా ఉన్నారని చెబుతూ, రతన్ టాటాకు శ్రీసిటీతో వున్న అనుబంధాన్ని రవీంద్ర సన్నారెడ్డి ప్రస్తావించారు. శ్రీసిటీ పారిశ్రామిక కుటుంబం తరపున టాటా కుటుంబానికి మరియు టాటా గ్రూప్‌కు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం

## పెన్నలపాడు, బండారుపల్లి రీచ్ లలో.. ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి అర్ధరాత్రి తనిఖీలు

**శ్రీకాళహస్తి మేజర్‌న్యూస్ :** శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపనున్నట్లు శ్రీకాళహస్తి ఆర్డిఓ భానుప్రకాష్ రెడ్డి అన్నారు. ఇసుకను సొంత అవసరాలకు కాకుండా వ్యాపారావసరాలకు తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నియోజకవర్గం పరిధిలోని స్వర్ణముఖి నది నుంచి పెద్ద ఎత్తున ఇసుక అక్రమ రవాణా జరుగుతుందన్న విషయం ఇటీవల పెద్ద ఎత్తున వివిధ దినపత్రికల్లో వచ్చిన నేపథ్యంలో ఆర్డీవో స్పందించారు. గురువారం అర్ధరాత్రి తొట్టంబేడు మండలం పెన్నలపాడు రీచ్, ఏర్పేడు మండలం బండారుపల్లి రీచ్ లను తన సిబ్బందితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెన్నలపాడు రీచ్ వద్ద తవ్వకాలు జరగకుండా బుధవారం రాత్రి ట్రెంచ్ కొట్టినట్లు ఆర్డీవో తెలిపారు. ఫలితంగా ఇక్కడ ఇసుక అక్రమ తవ్వకాలు జరిగే అవకాశం లేదనీ, ప్రస్తుత తనిఖీల్లో కూడా ఎక్కడా కూడా జెసిబిలు, హిటాచీలు కానరాలేదని వివరించారు. అనంతరం బండారపల్లి ఇసుక రీచ్ లో తనిఖీలు నిర్వహించారు. తొట్టంబేడు ఎస్ఐ ఈశ్వరయ్య పాల్గొన్నారు.



## శ్రీకాళహస్తిలో బిజెపి సభ్యత్వాలు నమోదు : పార్టీ నేత కోలా ఆనంద్



**శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి, అసెంబ్లీ పార్టీ కన్వీనర్ కోలా ఆనంద్ నేతృత్వంలో శ్రీకాళహస్తి పట్టణంలో జోరుగా సభ్యత్వాలు నమోదు కార్యక్రమం జరుగుతున్నది. అందులో భాగంగా ఈరోజు శ్రీకాళహస్తి పట్టణం బి.పి.అగ్రహారం కూడలి వద్ద భారతీయ జనతా పార్టీ సభ్యత్వం భరోసా - 2024 కార్యక్రమాన్ని యువమోర్చా ప్రధాన కార్యదర్శి ఆర్. హరీష్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు శిబిరాన్ని జాతీయ పార్టీ కార్యవర్గ సభ్యులు, కేరళ రాష్ట్ర మాజీ అధ్యక్షులు శ్రీ పి. కె. కృష్ణ దాసు, కోలా ఆనంద్. జిల్లా అధ్యక్షులు చంద్రప్పలు కలసి ముఖ్యఅతిథిలుగా శిబిరాన్ని సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యాతిథి పికె కృష్ణ దాసు మాట్లాడుతూ రాష్ట్రంలోనే శ్రీకాళహస్తి నియోజకవర్గ అసెంబ్లీని సభ్యత్వ నమోదాల్లో మూడవ స్థానాన్ని ఆక్రమించినందుకు అదే విధంగా గత 2019 నాటి సభ్యత్వాల సంఖ్యను శ్రీకాళహస్తి అధిగమించిందని కోలా ఆనంద్ నాయకత్వాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కేరళ రాష్ట్ర మాజీ బీజేపీ అధ్యక్షులు, జాతీయ పార్టీ కార్యవర్గ సభ్యులు పికె. కృష్ణ దాసు, బిజెపి రాష్ట్ర కార్యదర్శి, అసెంబ్లీ పార్టీ కన్వీనర్ శ్రీ కోలా ఆనంద్, జిల్లా అధ్యక్షులు సీసీ చంద్రప్ప, జిల్లా కార్యదర్శి, అసెంబ్లీ పార్టీ కో - కన్వీనర్ మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, పట్టణ అధ్యక్షులు గరికపాటి రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి పుణ్యం డిల్లీ కుమార్ రెడ్డి, పెదపాలెం రవి అచ్చారి్ష్న గారి పోలయ్య, పట్టణ యువమోర్చ అధ్యక్షులు తానికొండ్ల భరత్, సజ్జల హరీష్, సూర బిందు కుమార్, ధనుష్, కదూరు సమంత, చోటు, సిద్దు, నాని, గిరిధర్ సాయి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను ఆపాలి

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తి అంబేద్కర్ సర్కిల్ వద్ద వామపక్ష, మైనార్టీ నాయకులు సంఘాలు నాయకులు డిమాండ్ చేస్తూ.. పాలస్తీనా ప్రజలకు మద్దతుగా నిరసన ధర్నా నిర్వహించారు. వామపక్ష మాట్లాడుతూ గత సంవత్సరం 7 సెప్టెంబర్ 2023న సామ్రాజ్యవాద అమెరికా ప్రోద్బలంతో ఇజ్రాయిల్ పాలస్తీనా పై దురాక్రమణ దాడి మొదలు పెట్టి నేటికి సంవత్సరం అయిందని. ఈ సంవత్సర కాలంగా అభం శుభం ఎరుగని అమాయక పసి పిల్లలు, వృద్ధులు, మహిళలు పాలస్తీనా సాదారణ పౌరులు మొత్తం 86,000 మందికి పైగా మరణించారని, ఈ ఆధునిక కాలంలో దురాక్రమణ పేరుతో ప్రజలను చంపడం సమంజసమైంది కాదని, ప్రపంచ శాంతి వర్ధిల్లాలని ప్రపంచ ప్రజలంతా కోరుకుంటున్న, ఐక్య రాజ్య సమితి నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కి, అమెరికా దాని మిత్ర దేశాలు అభివృద్ధి చెందుతున్న, అభివృద్ధి చెందని దేశాల సంపదలు కుల్లగొట్టడం కై, తమ ఆధిపత్యం కొరకు దురాక్రమణ దాడులు చేయడం సహించరానిదని వారు అన్నారు. ఉగ్రవాదం పేరుతో ప్రపంచ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న అమెరికా ప్రపంచ ఉగ్రవాదానికే పెద్దన్నగా మారిందని వారన్నారు. ప్రపంచ ప్రజలంతా పాలస్తీనా ప్రజలకు సంఘీ భావం తెలుపుతుంటే, సామ్రాజ్య వాద




అహంకారం తలకెక్కిన అమెరికా ఇజ్రాయిల్ ను ఎగ దోస్తూ ఆయుధాలను సరఫరా చేస్తూ. నిర్దాక్షిణ్యంగా నిరాయుదులని హతమార్చడం దారుణమైనదని. వెంటనే పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ దాడిని నిలిపివేసి ప్రపంచ శాంతికి భాగం కావాలని వారు డిమాండ్ చేశారు, పాలిస్తే నాపై జరుగుతున్న దాడిని భారతదేశ ప్రపంచ దేశాలు అంతా ఒకటి ఇజ్రాయిల్ చేస్తున్న దురాక్రమాన్ని ఆపివేసి ప్రపంచ శాంతి నెలకొల్పే విధంగా కృషి చేయాలని కోరారు.

## రతన్ టాటా గొప్ప మానవతావాది.. దేశానికి తీరని లోటు

**ఓజిలి, మేజర్ న్యూస్:** పారిశ్రామిక రంగంలో ఉన్నత స్థితికి ఎదగడమే కాకుండా, సేవా దృక్పథం కలిగిన వ్యక్తి రతన్ టాటా అని రతన్ నోవల్ టాటా మరణం భారతదేశానికి తీరని లోటని ఓజిలి తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు గుజ్జులపూడి విజయ్ కుమార్ నాయుడు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశానికే, ప్రపంచ పారిశ్రామిక రంగానికి రతన్ టాటా ఆదర్శంగా నిలిచారన్నారు. ఆయన నేతృత్వంలో ఉప్పు నుంచి విమానయాన రంగు వరకు దేశంలో అణువణువులో టాటా పేరు ప్రతిధ్వనించేలా వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించారని కొనియాడారు. టాటా మృతికి తీవ్ర సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోధులు ఎప్పటికీ మరణించరు అని ఆయన అన్నారు.ఒక గొప్ప వ్యాపారవేత్తనే కాదు గొప్ప మానవతావాదిని కోల్పోయామన్నారు.



ఆయన పారిశ్రామిక రంగానికి చేసిన సేవ, జాతి నిర్మాణం లో, పరోపకారి గుణంలోనూ తరతరా లలో మార్పును తెచ్చిందని కొనియాడారు.పారిశ్రామిక రంగంలో ఉన్నత స్థితికి ఎదగడమే కాకుండా, సేవా దృక్పథం కలిగిన వ్యక్తి రతన్ టాటా అని కొనియాడారు. పేదవాడికి లక్ష రూపాయల కారును లాభపేక్ష లేకుండా ఆయన అందుబాటులోకి తీసుకువచ్చారని గుర్తు చేశారు. సామాజిక బాధ్యతతో రతన్ టాటా క్యాన్సర్ హాస్పటల్ నిర్మించడమే కాకుండా రోగులకు ఉచిత వైద్యం వారి ట్రస్టుల ద్వారా కోట్లాదిమంది ప్రజలకు సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఆయన వల్ల కోట్లాదిమంది ప్రజలు ఉద్యోగస్తులు వివిధ రంగాలకు చెందిన ఎంతోమంది ఉపాధి పొందుతున్నారని పేర్కొన్నారు.పారిశ్రామికవేత్తలు అతన్ని ఆదర్శంగా తీసుకొని సేవా కార్యక్రమాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన రతన్ టాటా మృతికి తీవ్ర సంతాపం ప్రకటనలో తెలియజేశారు.